https://teluguislam.net



బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ وَ الصَّلٰوةُ وَ السَّلَامُ عَلٰى رَسُوْلِهِ الْاَمِيْنِ وَ الْعَاقِبَةُ لِلْمُتَّقِيْنَ اَمَّا بَعْدُ!

అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్ వస్సలాతు వస్సలాము అలా రసూలిహిల్ అమీన్ వల్ ఆఖిబతు లిల్‌ముత్తఖీన్ అమ్మాబాద్!

మనోహరమైన, సుఖసౌఖ్యాలతో కూడుకున్న ఈ మూన్నాళ్ల జీవితపు ముచ్చట తీరిన తర్వాత-రాబోయే దశలు అత్యంత కఠినంగా, బాధాకరంగా, వ్యధాభరితంగా ఉంటాయి. అన్నిటికంటే మొదటిదశ చావు. ప్రాణమున్న ప్రతి జీవి చావు గుటక వేయవలసిందే. ప్రాణమున్న ప్రతిజీవి మృత్యువును చవి చూడవలసిందేనని అల్లాహ్ సెలవిస్తున్నాడు. ﴾كُلُّ نَفْسٍ ذَائِقَةُ الْمَوْتِ﴿ (అలి ఇమ్రాన్:185) వేరొక చోట ఆయన ఇలా అన్నాడు: అల్లాహ్ ఉనికి తప్ప ప్రతిదీ నశించిపోయేదే. (అల్‌ఖసస్:88 వ సూక్తి). ﴾كُلُّ شَيْءٍ هَالِكٌ اِلَّا وَجْهَهٗ﴿

మరణించిన తర్వాత ఎవరూ తిరిగిరారు. కనుక మృత్యువు సంభవించేటప్పటి పరిస్థితి ఎలా ఉంటుందో ఖచ్చితంగా చెప్పలేము. కాని చావు తీవ్రతను గురించి, దాని దుర్భరస్థితి గురించి ఖుర్‌ఆన్ హదీసుల్లో చెప్పబడిన విషయాలను బట్టి చూస్తే ప్రపంచ జీవితంలో ఎదురయ్యే కష్టాలు, కడగండ్లు, ఆపదలు, బాధలు, దుఃఖవిచారాలన్నిటిని కలిపితే ఎంత నొప్పి అవుతుందో చావు సంభవించినప్పుడు అంతకన్నా ఎక్కువ నొప్పి కలుగుతుందని తెలుస్తోంది.

ఖాఫ్ సూరాలో దేవుడు ఇలా సెలవిచ్చాడు: ﴾وَجَاءَتْ سَكْرَةُ الْمَوْتِ بِالْحَقِّ﴿ మరణవేదన సత్యంతో వచ్చేసింది (19వ సూక్తి). ఇక్కడ సత్యమంటే సమాధి జీవితానికి సంబంధించిన వాస్తవాలు, నిజాలు. (మరణానంతరం) మనిషికి దైవదూతలు కనిపిస్తారు. తాను శిక్షకు గురికానున్నాడో లేక పుణ్యఫలం అనుభవించనున్నాడో అతనికి నమ్మకంగా తెలిసిపోతుంది.

చావు తీవ్రతను, దాని దుర్భర స్థితిని ప్రస్తావిస్తూ ఖియామా సూరాలో దేవుడు ఇలా అంటున్నాడు:

﴾كَلَّا اِذَا بَلَغَتِ التَّرَاقِيَ وَقِيْلَ مَنْ رَاقٍ وَظَنَّ اَنَّهُ الْفِرَاقُ وَالْتَفَّتِ السَّاقُ بِالسَّاقِ﴿

ప్రాణం గొంతులోకి వచ్చినప్పుడు, "మంత్రించి ఊదే వారెవరయినా ఉన్నారా?" అని అడుగుతారు. అప్పుడు మనిషి అది ప్రపంచం నుండి వేరైపోయే సమయమని తెలుసుకుంటాడు. అప్పుడు ఒక కాలు మరొక కాలుతో కలిసిపోతుంది. (26 నుంచి 29 సూక్తులు)

https://teluguislam.net



ఒక కాలు మరొక కాలుతో కలవటమంటే చావు వచ్చినప్పుడు పుంఖాను పుంఖాలుగా బాధలు వస్తుంటాయి. (ఆ బాధకు తాళలేక మనిషి ఒక కాలుతో మరొక కాలికి రాపిడి చేసుకుంటాడు). అప్పుడు గాని ప్రాణం దేహం నుంచి బయటికి రాదు.

దైవప్రవక్త (సల్లం) "మృత్యువు బాధ చాలా తీవ్రంగా ఉంటుంది" అని చెప్పారు. (అహ్మద్)

వేరొక హదీసులో ఆయన ఇలా ప్రబోధించారు: జీవన మాధుర్యాన్ని మరిపించే చావుని అత్యధికంగా గుర్తు చేసుకుంటూ ఉండండి" (తిర్మిజీ, నసాయి, ఇబ్నెమాజా)

దైవ ప్రవక్త (సల్లం) మరణవ్యాధికి గురైనప్పుడు ఎంత కలవరపడిపోయారో చూడండి. ఆయన దగ్గర ఒక నీళ్ల పాత్ర ఉండేది. అందులో ఆయన మాటిమాటికీ చేతులు ముంచేవారు. తడిచేతులతో ముఖం తుడుచుకుంటూ ఉండేవారు. కాసేపు ముఖం మీద దుప్పటి కప్పుకునేవారు. తర్వాత ఒక్కసారిగా దుప్పటి తీసి చూసేవారు. మృత్యువు బాధ తీవ్రమై నిస్పృహ ఆవహించినప్పుడు మొహం మీది చెమట తుడుచుకుంటూ "సుబ్‌హానల్లాహ్! ఇన్న లిల్‌మౌతి లసకరాతిన్" (సుబ్‌హానల్లాహ్! చావు నొప్పులు చాలా తీవ్రంగా ఉన్నాయి) అని అనేవారు (బుఖారీ). "దైవప్రవక్త మరణబాధ అనుభవిస్తుండగా కళ్లారా చూసిన నేను ఇంకెవరి మరణబాధనూ తప్పుగా భావించను" అని ఆయిషా (రజి. అన్‌హా) అభిప్రాయపడ్డారు (బుఖారీ).

జీవితపు చరమ గడియల్లో దైవప్రవక్త (సల్లం) మాటల్లో నత్తి కూడా వచ్చింది (ఇబ్నెమాజా). ఈజిప్ట్ విజేత అమ్ర్ బిన్ ఆస్ (రజి) తాను బతికి ఉన్నప్పుడు "మరణించే సమయంలో స్పృహ, తెలివి ఉండి కూడా మరణ పరిస్థితిని వివరించనివారిని చూస్తే నాకు ఆశ్చర్యమేస్తుంది" అని తరచూ అంటుండేవారు. కాని ఆ తర్వాత తనే మృత్యువు దరికి చేరుకున్నప్పుడు అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఆయనకు ఆయన అన్న మాట గుర్తుచేశారు. అప్పుడు అమ్ర్ (రజి) ఓ వేడి నిట్టూర్పు విడిచి ఇలా చెప్పనారంభించారు: మరణబాధ వర్ణించరానిది. ఒక విషయం మాత్రం చెప్పగలను. ఇప్పుడు నాకు ఆకాశం విరిగి భూమిమీద పడినట్టు, నేను వాటిమధ్య నలిగిపోతున్నట్టు అనిపిస్తోంది. నా మెడమీద పెద్ద పర్వతం ఉన్నట్లుంది. కడుపులో ఖర్జూరపు ముళ్లు నింపినట్లుంది. శ్వాస సూదిరంధ్రం గుండా పోతుందా అన్నంత కఠినంగా ఉంది నా పరిస్థితి.

హజ్రత్ షద్దాద్ బిన్ ఔస్ (రజి) ఇలా అంటున్నారు: మృత్యువు గడియ ప్రపంచం, పరలోకంలోని బాధలన్నిటికంటే తీవ్రంగా ఉంటుంది. అది రంపపు కోతల కన్నా బాధాకరంగా, కత్తెరల కత్తిరింపుల కన్నా నొప్పిగా, కుండల ఉడుకుదనం కన్నా తీవ్రంగా ఉంటుంది. మరణించినవాడు గనక ఒకసారి బ్రతికి మరణబాధ ఎలా ఉంటుందో

https://teluguislam.net



ప్రజలకు వివరిస్తే ఇక వారికి సుఖం ఉండదు, నిద్రా ఉండదు.

హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై) ఈ విధంగా ప్రార్థించేవారు: اَللّٰهُمَّ هَوِّنْ عَلَيَّ الْمَوْتَ "అల్లాహుమ్మ హవ్విన్ అలయ్యల్ మౌత" (ఓ అల్లాహ్! నా మరణబాధలోని తీవ్రతను తగ్గించు).

– దైవప్రవక్త (సల్లం) విశ్వాసికి, అవిశ్వాసికి వేర్వేరు మరణ పరిస్థితులు వివరించారు. దాని సారాంశం ఇది: విశ్వాసికి మరణ సమయం ఆసన్నమైనప్పుడు సూర్యతేజస్సులాంటి మొహాలు కలిగిన దైవదూతలు అతని శవవస్త్రం (కఫన్) కోసం తమ వెంట స్వర్గం నుంచి పరిమళం గుభాళిస్తూ ఉండే శ్వేతపట్టు వస్త్రం తీసుకొని వస్తారు. వచ్చి ఆ విశ్వాసికి "అస్సలాము అలైకుమ్" అని సలాం చెబుతారు. మృత్యుదూత ప్రాణం తీసేముందు "ఓ పవిత్రాత్మా! సంతోషించు, నీకు దేవుని కారుణ్యాలు లభిస్తాయి. స్వర్గానుగ్రహాలు ప్రాప్తిస్తాయి" అని శుభవార్త చెబుతాడు. ఆ శుభవార్త వినగానే విశ్వాసికి మనసులో అల్లాహ్ వద్దకు వెళ్ళాలని తీవ్రవాంఛ కలుగుతుంది. దాంతో విశ్వాసి ప్రాణం కూజ నుంచి మూత తీయగానే నీళ్లు బయటికి వచ్చినట్టు బయటికి వస్తుంది. దైవదూతలు ఆత్మను బయటికి తీసిన తర్వాత దాన్ని సువాసనలు గుభాళిస్తున్న తెల్లని పట్టువస్త్రంలో చుట్టుకొని ఆకాశంవైపు తీసుకువెళ్తారు. ఆ సమయంలో విశ్వాసి ఆత్మ నుంచి కస్తూరి లాంటి సువాసన వస్తూ ఉంటుంది. అది ఎంత ఘాటుగా ఉంటుందంటే ఆకాశంలో ఉండే దైవదూతలు ఆ వాసన చూసి "ఏ విశ్వాసి ఆత్మో పైకి వస్తోంది" అని చెప్పుకుంటారు.

దైవదూతలు ఆకాశపు ద్వారం తడతారు. లోపలినుంచి మొదటి ఆకాశపు దూతలు "ఈ పవిత్ర ఆత్మ ఎవరు"? అని అడుగుతారు. దానికి దైవదూతలు సమాధానంగా "ఇతను ఫలానా. ఫలానా అతని కుమారుడు" అని చెబుతారు. ఆకాశదూతలు ద్వారం తెరుస్తారు. అతనికి స్వాగతాలు చెబుతారు. ఆ పవిత్ర ఆత్మకు దేవుని కరుణాకటాక్షాలు లభిస్తాయనే శుభవార్తను అందజేస్తారు. దైవదూతలు దాన్ని రెండవ ఆకాశానికి తీసుకువెళ్తారు. మొదటి ఆకాశ దూతలు ఆ విశ్వాసి గౌరవార్థం వారిని రెండో ఆకాశం వరకూ సాగనంపుతారు. రెండో ఆకాశంమీద కూడా ఆ విశ్వాసి ఆత్మకు మొదటి ఆకాశంలోలాగానే ఘనస్వాగతాలు పలకడం జరుగుతుంది. తర్వాత మూడు, నాలుగు ఈ విధంగా ఆత్మ ఏడో ఆకాశానికి చేరుకుంటుంది. అక్కడికి చేరుకున్న తర్వాత "నా ఈ దాసుని పేరు ఇల్లియ్యీన్ (ఉన్నతస్థాయి వ్యక్తుల జాబితా)లో రాయమ'ని దైవాజ్ఞ అవుతుంది. ఆ తర్వాత అతని ఆత్మను కొన్ని ప్రశ్నలు అడగటం కోసం తిరిగి దేహంలోకి ప్రవేశింపజేయటం జరుగుతుంది.

https://teluguislam.net



సమాధిలోకి వచ్చే దూతలను ముంకిర్, నకీర్ అంటారు. వారి మొహాలు నల్లగా ఉంటాయి. నీలంరంగు మెరిసేటి పెద్దకళ్లు ఉంటాయి. పళ్లు ఆవు కొమ్ముల్లా పెద్దగా ఉంటాయి. గొంతు పిడుగులా గర్జిస్తూ ఉంటుంది. వారు దంతాలతో నేలను చీలుస్తూ దగ్గరిక్కి వచ్చి అత్యంత కఠోర శబ్దంతో అడుగుతారు, "మర్రబ్బుక... నీ ప్రభువు ఎవరు? మన్నబియ్యుక.... నీ ప్రవక్త ఎవరు? మా దీనుక... నీ ధర్మం ఏది?" అని.

సమాధి చీకటి, అందులోనూ ఒంటరితనం, ముంకిర్ నకీర్‌ల భయంకర మొహాలు ఇవన్నీ చూసినప్పటికీ విశ్వాసికి ఎలాంటి భయాందోళనలూ కలగవు. అతను ఎంతో ప్రశాంతంగా మంకిర్ నకీర్‌ల ప్రశ్నలకు సమాధానం చెబుతాడు. విశ్వాసుల్లో కొందరికి ప్రశ్నల సమయంలో సూర్యుడు అస్తమించబోతున్నట్టు చూపించటం జరుగుతుంది. అది చూసి విశ్వాసి దైవదూతల ప్రశ్నలకు సమాధానం ఇవ్వటానికి సున్నితంగా నిరాకరిస్తూ "కాస్త ఆగండి. ముందు నన్ను అస్ర్ నమాజ్ చేసుకోనివ్వండి. ఆ తర్వాత నేను మీ ప్రశ్నలకు సమాధానం చెబుతాను" అంటాడు. కాని ఆ తర్వాత అది నమాజ్ చేసే స్థలం కాదని తెలియగానే ముంకిర్, నకీర్‌ల ప్రశ్నలకు సమాధానం చెబుతాడు.

ఈ ప్రశ్నలు-సమాధానాల తంతు ముగిసిన తర్వాత నరకం వైపు ఒక రంధ్రం చేసి దానివైపు చూపిస్తూ "ఇది అగ్ని. దేవుడు తన కరుణాకటాక్షాలతో నిన్ను దీన్నుంచి కాపాడాడు"అని చెప్పటం జరుగుతుంది. ఆ తర్వాత స్వర్గంవైపు ఒక రంధ్రం చేయబడుతుంది లేక ఒక స్వర్గద్వారం తెరువబడుతుంది. విశ్వాసి దాని గుండా స్వర్గవరాలను తిలకించి ఆనందిస్తాడు. అప్పుడు విశ్వాసికి స్వర్గంలో తనకు లభించబోయే ఇల్లు కూడా చూపించబడుతుంది. అతని సమాధి డెబ్భై గజాల వరకు (లేక కనుచూపు మేరకు) విశాలమవుతుంది. అందులో పౌర్ణమి నాటి పండువెన్నెల కాస్తుంది. అతనికి పరిమళభరిత స్వర్గదుస్తులు తొడిగించటం జరుగుతుంది. సుగంధభరిత, సుఖవంతమైన, మృదువుగా మెత్తగా ఉండే స్వర్గపడక అతని కోసం ఏర్పాటు చేయబడుతుంది. ఆ తర్వాత సమాధిలో అతని దగ్గరికి అందమైన ముఖారవిందంతో, పరిమళభరిత దుస్తులు ధరించి ఉన్న వ్యక్తి ఒకడు వస్తాడు. విశ్వాసి అతన్ని "ఎవరు నువ్వు"? అని అడుగుతాడు. దానికతను "నేను నీ సదాచరణను, పరలోక జీవితంలో నీకు సుఖాలు, బహుమానాల శుభవార్త అందజేయటానికి వచ్చాను" అని చెబుతాడు. అప్పుడు విశ్వాసి "ఓ నా ప్రభూ! ప్రళయం తొందరగా రానీ, నేను నా ఇంటివారిని కలవాలి" అని కోరుకుంటాడు. మరికొన్ని హదీసుల్లో ఈ విధంగా కూడా ఉంది: విశ్వాసి 'నేను నా ఇంటివారి దగ్గరికి వెళ్లాలనుకుంటున్నాను. నాకు కలిగిన ఈ శుభపరిణామం గురించి వారికి తెలియజేయాలి' అని అంటాడు. దానికి సమాధానంగా దైవదూతలు "(ఇప్పుడు ఇక్కణ్ణుంచి తిరిగి వెళ్ళటానికి వీల్లేదు) కనుక నీవు ఒక నూతన వధువులాగా హాయిగా నిదురపో" అని

https://teluguislam.net



అంటారు. ఆ తర్వాత విశ్వాసి పడుకుంటాడు. చివరికి ప్రళయదినాన అల్లాహ్ అతన్ని అతని సమాధి నుంచి లేపుతాడు. ఇక్కణ్ణుంచి పరలోక జీవితానికి సంబంధించిన రెండవ దశ మొదలవుతుంది. దాని వివరాలు ఇన్షాఅల్లాహ్ తర్వాతి పుస్తకంలో ఇవ్వబడతాయి.

అవిశ్వాసికి మరణగడియలు సమీపించినప్పుడు అతని ఆత్మను తీసుకెళ్ళటానికి అత్యంత భయంకరమైన నల్లటి మొహాలు కలిగి ఉండే దైవదూతలు అతని శవ వస్త్రం (కఫన్) కోసం దుర్గంధభరిత గోనెసంచి తీసుకొనివస్తారు. వచ్చీరాగానే "ఓ నీచాత్మా! దైవాగ్రహానికి పాత్రమైన ఆత్మా! దైవాగ్రహానికి పాత్రమైన ఆత్మా!" అని పిలుస్తారు. దైవాగ్రహం, నరక శిక్షల 'శుభవార్తలు' దానికి అందజేస్తారు. అవిశ్వాసి ఆత్మ భయాందోళనల వల్ల దేహం నుంచి త్వరగా బయటికి రాదు. అప్పుడు దైవదూతలు పచ్చిగా ఉన్న ఉన్నిలో నుంచి ముళ్లున్న ఇనుప కమ్మీని బలవంతంగా లాగినట్టు దాన్ని బలవంతంగా లాగి బయటికి తీస్తారు. దివ్యఖుర్ఆన్‌లో ఆ స్థితిని ఈ మాటల్లో వివరించటం జరిగింది. "(అవిశ్వాసుల ప్రాణాన్ని) మునిగి లాగితీసే దైవదూతల సాక్షిగా' '! (నాజిఅత్ సూరా, 1 వసూక్తి) అంటే అది బయటికి రానని మొండికేస్తుంది. అప్పుడు దైవదూతలు దాన్ని బలవంతంగా బయటికి తీస్తారు. మరో చోట అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

﴿وَلَوْ تَرَىٰ إِذِ الظَّٰلِمُونَ فِي غَمَرَاتِ الْمَوْتِ وَالْمَلَٰٓئِكَةُ بَاسِطُوٓا أَيْدِيهِمْ أَخْرِجُوٓا أَنفُسَكُمُ الْيَوْمَ تُجْزَوْنَ عَذَابَ الْهُونِ بِمَا كُنتُمْ تَقُولُونَ عَلَى اللَّهِ غَيْرَ الْحَقِّ وَكُنتُمْ عَنْ آيَٰتِهِ تَسْتَكْبِرُونَ﴾

ఈ దుర్మార్గులు మరణవేదనలో మునిగి తేలుతూ ఉండగా, దైవదూతలు తమ హస్తాలను చాచి "ఇటు తెండి! బయటికి తీయండి మీ ప్రాణాలను, అల్లాహ్‌పై అపనిందను మోపి అన్యాయంగా కూసిన కూతలకూ, ఆయన అయతుల పట్ల తలబిరుసుతనం ప్రదర్శించినందుకూ ఫలితంగా ఈ రోజు మీకు అవమానకరమైన శిక్ష విధించబడుతుంది" అని అంటూ ఉండగా ఆ దృశ్యాన్ని నీవు చూడగలిగితే ఎంత బాగుండు! (అన్ఆమ్ సూరా, 93వ సూక్తి)

ఆ సమయంలో అవిశ్వాసి ఆత్మ నుంచి కుళ్లి కృశించిపోయిన మృతకళేబరం నుంచి ఎంతటి అసహ్యకరమైన వాసన వస్తుందో అంతటి దుర్గంధం వస్తుంది. దైవదూతలు దాన్ని ఆకాశం వైపు తీసుకెళ్తున్నప్పుడు ఆకాశదూతలు దూరం నుంచే దాని దుర్వాసన చూసి "ఏదో పాడు ఆత్మ ఆకాశం వైపు తీసుకురాబడుతున్నట్లుంది" అని అనుకుంటారు. మృత్యుదూతలు ఆ దుర్గంధ భరిత అవిశ్వాసి ఆత్మను తీసుకొని మొదటి ఆకాశానికి చేరుకొని ద్వారం తడతారు. లోపలినుంచి ద్వారపాలకులు "ఎవరి ఆత్మ అది"? అని

https://teluguislam.net


అడుగుతారు. దానికి మృత్యుదూతలు "ఇతను ఫలానా. ఫలానా అతని కుమారుడు" అని చెబుతారు. అది విని ద్వారపాలకదూతలు "ఈ నీచదేహపు నీచాత్మకు మా దగ్గర ఎలాంటి గౌరవం లేదు. దీనికోసం ఆకాశద్వారాలు తెరువబడవు. దీనిని పరాభవం పాలుచేసి తిరిగి భూలోకానికే తీసుకువెళ్ళండి" అని అంటారు. దాంతో మృత్యుదూతలు అతని ఆత్మను మొదటి ఆకాశం దగ్గర్నుంచే భూమి మీదకు విసిరిపారేస్తారు. అటు అల్లాహ్ తరఫునుంచి దాని పేరు సిజ్జీన్ (ఖైదీల పేర్ల జాబితా)లో రాయమని ఆజ్ఞ అవుతుంది. ఆ తర్వాత అతని ఆత్మను ప్రశ్నలు అడగటం కోసం తిరిగి దేహంలోకి వదిలేయటం జరుగుతుంది.

సమాధిలో ముంకిర్, నకీర్ తన దగ్గరకు వచ్చినప్పుడు అవిశ్వాసి తీవ్రభయాందోళనకు గురౌతాడు. ముంకిర్ నకీర్‌లు "ముర్రబ్బుక? మన్నబియ్యుక? మా దీనుక?" అని అడుగుతారు. దానికి అవిశ్వాసి "హా, హా లా అద్‌రీ; అయ్యో అయ్యో.... నాకు ఈ విషయాలేవీ తెలియవే!" అని వాపోతాడు. అదే కపట విశ్వాసి అయితే "ప్రజలు ఏం చెబుతుండగా విన్నానో నేనూ అదే చెబుతున్నాను" అని అంటాడు. అవిశ్వాసి లేక కపటి ఈ జవాబు చెప్పిన తర్వాత ఒక స్వర్గద్వారం తెరిచి అతనికి స్వర్గవరాల చిరు దర్శనం చేయించి "ఇది స్వర్గం. నీ అవిశ్వాసం లేక నీ కపటరోగం మూలంగా దేవుడు నీకు ఇది దక్కకుండా చేశాడు" అని చెప్పటం జరుగుతుంది. ఆ తర్వాత అతని కొరకు నరకం వైపు ఉండే ద్వారం ఒకటి తెరువబడుతుంది. దాని ద్వారానే అతనికి అగ్నిశిక్ష విధించబడుతుంది. నరకంలో తన నివాసం కూడా అతనికి చూపెట్టబడుతుంది. అప్పుడు అతనికి అగ్నివస్త్రాలు తొడిగించమని, అతని కోసం అగ్ని పడక సిద్ధం చేయమని అల్లాహ్ తరఫునుంచి ఆజ్ఞ అవుతుంది. అతన్ని శిక్షించటం కోసం అంధులు, మూగలైన దూతలు నియుక్తులవుతారు. వారు అతన్ని గదలతో చితకబాదుతూ ఉంటారు. దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: ఆ గద ఎంత బరువుగా ఉంటుందంటే దాంతో కొండను కొడితే కొండ కూడా తుక్కుతుక్కు అయిపోతుంది. అంతేకాదు ఆ అవిశ్వాసి మీదకు తొంభై తొమ్మిది సర్పాలు వదలటం జరుగుతుంది. అవి అతన్ని ప్రళయం వరకూ కాటేస్తూ ఉంటాయి. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: సమాధి సర్పం ఎంత విషపూరితంగా ఉంటుందంటే, అది నేలమీద ఒకసారి ఊదితే చాలు ఇక అక్కడ మొక్క అనేది మొలకెత్తదు. ఈ శిక్షలతోపాటు ఇంకో శిక్ష కూడా అవిశ్వాసికి ఇవ్వబడుతుంది. అదేమిటంటే, సమాధిగోడలు మాటిమాటికీ బిగుసుకుపోతుంటాయి. దానిమూలంగా అతని పక్కటెముకలు ఒకదానిలోకి ఒకటి చొచ్చుకుపోతాయి. అవిశ్వాసికి ఈ శిక్షలన్నీ ప్రళయం వరకూ ఇవ్వబడుతూ ఉంటాయి.

సమాధిలో అవిశ్వాసి దగ్గరికి తీవ్రభయంకరమైన, దుర్గంధభరితమైన మహాకురూపి ఒకడు వస్తాడు. అతన్ని చూడగానే అవిశ్వాసి భయంతో "ఎవర్నువ్వు?" అని అడుగుతాడు.

https://teluguislam.net



దానికి ఆ కురూపి "నేను నీ కర్మను. నీకు చెడు పరిణామ వార్త అందజేయటానికి వచ్చాను" అంటాడు. దాంతో అవిశ్వాసి భయపడి 'ఓ నా ప్రభూ! ప్రళయాన్ని రానీయకు' అని వేడుకుంటాడు. ఈ విధంగా అవిశ్వాసి మృత్యు గడియ నుంచే దైవశిక్షకు గురయి ప్రళయం వరకూ నిరంతరాయంగా ఇలాంటి శిక్షలు అనుభవిస్తూ ఉంటాడు. అల్లాహ్ తన కృపతో, అనుగ్రహంతో ప్రతి ముస్లింని సమాధి శిక్ష నుంచి కాపాడుగాక!(ఆమీన్)

ఈ ప్రశ్న-సమాధానాల తంతు ముగిసిన తర్వాత విశ్వాసి ఆత్మను 'ఇల్లియ్యీన్'లో ఉంచటం జరుగుతుంది. పోతే అవిశ్వాసులు, కపటులు, బహుదైవారాధకుల ఆత్మలు 'సిజ్జీన్'లో బంధించబడతాయి. ఇక్కడ ఒక విషయం గమనార్హం. విశ్వాసుల పేర్లు నమోదు చేయబడే గ్రంథాన్ని (రిజిష్టరును), విశ్వాసుల ఆత్మలు ప్రళయం వరకూ ఉంచబడే స్థలాన్ని-రెండిటినీ ఇల్లియ్యీన్ అనే పిలుస్తారు. అలాగే అవిశ్వాసుల, బహుదైవారాధకుల పేర్లు నమోదు చేయబడే పుస్తకానికి, వారి ఆత్మలు ప్రళయం వరకూ బంధించబడే ప్రదేశానికి రెండిటికీ సిజ్జీన్ అనే పేరు! వాస్తవం అల్లాహ్‌కే బాగా తెలుసు.

ఇదండీ! దుర్భేధ్య కనుమ లాంటి సమాధి గాథ! దీని గురించే దైవప్రవక్త సల్లం "నేను సమాధికంటే దుర్భరమైన, ఆందోళనకరమైన స్థలం మరొకటి చూడలేదు" అని అన్నారు (తిర్మిజీ). ఈ సమాధి యాతన బారినుంచి శరణు వేడుకోమనే ఆయన తన అనుచరులకు ఉద్బోధించారు (అహ్మద్). హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) ఇలా అంటున్నారు: దైవప్రవక్త (సల్లం) మాకు సమాధి ఉపద్రవం నుంచి శరణు వేడే ప్రార్థన ఖుర్‌ఆన్‌లోని సూక్తులు నేర్పించినట్లు నేర్పించారు (నసాయి). ఒకసారి ఆయన ఉపన్యాసమిస్తూ తన అనుచరులను అప్రమత్తం చేయటానికి వారితో "మీరు సమాధుల్లో దజ్జాల్ ఉపద్రవం ద్వారా పరీక్షించబడినట్లు పరీక్షించబడతారు" అని అన్నారు. ఆ మాట వినగానే అనుచరులు భయంతో అశ్రువులు ధారలై ప్రవహించేలా ఏడ్చారు, (నసాయి). విశ్వాసుల నాయకులు హజ్రత్ ఉస్మాన్ (రజి) తనకు సమాధి విషయం గుర్తుకొస్తే కన్నీళ్లతో గడ్డం తడిచిపోయేలా ఏడ్చేవారు. పైగా ఇలా అనేవారు: "పరలోక జీవితంలో సమాధి మొదటి దశ. సమాధిలో ముక్తి పొందినవాడికి తర్వాతి దశలు కూడా సులభమయిపోతాయి. ఈ దశలో ముక్తి లభించనివాడికి మిగతా దశలు దీనికంటే దుర్భరంగా ఉంటాయి. (తిర్మిజీ)

హజ్రత్ ఉమర్ (రజి) సమాధిని, పరలోక జీవితాన్ని గుర్తుకు తెచ్చుకొని ఎంతగా విలపించేవారంటే, ఆ విధంగా విలపిస్తూ విలపిస్తూ ఆయన మొహం మీద రెండు చారలు ఏర్పడ్డాయి (బైహఖీ). దైవప్రవక్త (సల్లం) మృత్యువు మరియు సమాధి గురించి ఉపన్యాసం ఇస్తుండగా అబూజర్ర్ గిఫారీ (రజి) విని "అయ్యో! నేను చెట్టునయివుంటే బాగుండేది. ఎవరి చేతనయినా కోయబడేవాడిని" అనుకున్నారు (ఇబ్నెమాజా). హజ్రత్

https://teluguislam.net



అబూహురైరా (రజి) తనకు మరణగడియ ఆసన్నమయినప్పుడు ఏడ్వటం మొదలుపెట్టారు, ప్రజలు చూసి "అబూహురైరా! ప్రపంచాన్ని వదలిపెట్టి వెళ్ళాల్సి వస్తున్నందుకు ఏడుస్తున్నావా?" అని అడిగారు. అందుకాయన "కాదు, ప్రయాణం చూస్తే బహు సుదీర్ఘమైనది. నా దగ్గరేమో సామాగ్రి కొంతే ఉంది. అందుకని ఏడుస్తున్నాను. నా పరిస్థితి ఎలాగుందంటే నేనొక ఎత్తయిన గుట్ట మీద నించున్నాను. దాని ముందు స్వర్గమైనా ఉంటుంది లేక నరకమైనా ఉంటుంది. వాటిలో నా గమ్యస్థానం ఏదో నాకు తెలియదు" అని విచారం వ్యక్తం చేశారు. (కితాబుజ్జుహద్)

హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) మృత్యువును, సమాధిని తలచుకొని ఎంతగా భయపడిపోయేవారంటే, దాన్ని మనం ఆయనగారి ఈ వేడుకోలు కవిత ద్వారా అంచనా వేసుకోవచ్చు.

كَيْفَ حَالِىْ يَا اِلٰهِىْ لَيْسَ لِىْ خَيْرُ الْعَمَلْ

سُوْءُ اَعْمَالِ كَثِيْرٌ زَادُ طَاعَاتِىْ قَلِيْلٌ

"ఓ అల్లాహ్! నా పరిస్థితి ఎలా ఉంటుందో? నా దగ్గర మంచి కర్మ ఒక్కటి కూడా లేదు. దుష్కర్మలు చాలా ఉన్నాయి. విధేయతా సామాగ్రి కూడా తక్కువ ఉంది" అని, దాని సారాంశం.

భయంకరమైన సమాధి కనుమను తలచుకొని మన పూర్వీకులు ఎంతగా భయపడిపోయేవారో ఈ రోజు మనం దాని గురించి అంతగా నిర్భయులైపోయాం. నిర్లక్ష్యం చేస్తున్నాం. ప్రపంచపు రంగుల హరివిల్లుకు ఎంతగా మంత్రముగ్ధులయిపోయామంటే, దాని తళుకుబెళుకులకు ఎంతగా తన్మయులై పోయామంటే ఎప్పుడయినా పొరపాటున కూడా మనకు సమాధి గుర్తుకురాదు. మన ఈ అజాగ్రత్తకు, నిర్లక్ష్యానికి, ఏమరుపాటుకు ఖుర్‌ఆన్ చేసిన తీర్మానం సరిగ్గా అనుతుంది.

﴿اِقْتَرَبَ لِلنَّاسِ حِسَابُهُمْ وَهُمْ فِىْ غَفْلَةٍ مُّعْرِضُوْنَ﴾

"మానవుల లెక్కల సమయం సమీపించింది. అయినా వారు ఏమరుపాటులో పడి విముఖులై ఉన్నారు. (అంబియా సూరా 1వ సూక్తి)

అల్లాహ్ తన కరుణాకటాక్షాలతో మన పరిస్థితి మీద దయచూపుగాక! చనిపోకముందే దుర్భేధ్యమైన సమాధి కనుమ గుండా ప్రయాణించటానికి ఏమైనా సన్నాహాలు చేసుకునే సద్బుద్ధిని ప్రసాదించుగాక! (ఆమీన్).

https://teluguislam.net



# సమాధిలో మూడు ప్రశ్నలు

సమాధిలో ముంకిర్, నకీర్ దూతలు మూడు ప్రశ్నలు వేస్తారు. అవి (1) మర్రబ్బుక నీ ప్రభువు ఎవరు? 2) మన్నబియ్యుక.... నీ ప్రవక్త ఎవరు? (3) మా దీనుక... నీ ధర్మం ఏది?

పైకి ఈ మూడు ప్రశ్నల సమాధానం చాలా చిన్నదిగా, సులభమైనదిగా అనిపిస్తుంది, అంటే నాప్రభువు అల్లాహ్, నా ప్రవక్త ముహమ్మద్ (సల్లం), నా ధర్మం ఇస్లాం. కాని వాస్తవానికి ఈ మూడు ప్రశ్నలు ఎంత సమగ్రమైనవంటే మనిషి జీవితంలోని కర్మలన్నిటి సారాంశమంతా ఈ మూడు ప్రశ్నల సమాధానానికి అనుగుణంగా జీవితం గడిపిన వ్యక్తి మాత్రమే వాటికి సమాధానం చెప్పగలడు. ఉన్నత విద్యార్హతలు, ఉత్తమ బుద్ధివివేచనాలు ఆ రోజు మనిషికి ఎందుకూ పనికిరావు.

నాన్నగారు హాఫిజ్ ఇద్రీస్ కైలానీ (రహ్మలై) ఒక సంఘటన చెబుతూ ఉండేవారు: 1930-40 దశాబ్దం నాటి మాట. గుజ్రాన్‌వాలాలోని జామియా ముహమ్మదియాలో నేను విద్యాభ్యాసం చేస్తున్నాను. కీల్యాన్‌వాలా ఊరు నుండి గుజ్రాన్‌వాలా పట్టణానికి వెళ్ళేదారిలో గూంద్‌లాన్‌వాలా అనే ప్రాంతముంది. అక్కడ ఒకతను గుర్రాలకోసం గడ్డి అమ్ముతుండేవాడు. మేము అటునుంచి వెళ్ళినప్పుడల్లా అతను "రెండు పైసలకు ఒక బిండ. రెండు పైసలకు ఒక బిండ" అని అరుస్తూ కనిపించేవాడు. అతని జీవితమంతా ఇలాగే గడ్డి అమ్ముకోవడంలోనే గడిచిపోయింది. ఏనాడైనా అతను నమాజ్, ఉపవాసాలు పాటించలేదు. ఖురాన్ పఠించలేదు. కనీసం దేవుణ్ణి, ఆయన ప్రవక్తను కూడా జ్ఞాపకం చేసుకోలేదు.... అతని చావు సమయం ఆసన్నమైనప్పుడు అతని బంధువులు అతని దగ్గర కూర్చొని "లా ఇలాహ ఇల్లల్లాహ్" పఠించటం మొదలుపెట్టారు, అతని నోటితో కూడా ఆ సద్వచనం పలికించాలని. కాని శోచనీయమైన విషయం ఏమిటంటే జీవితాంతం అతని నోటినుండి ఏ పలుకులయితే వెలువడ్డాయో మరణ సమయంలోనూ అవే పలుకులు వెలువడ్డాయి. రెండు పైసలకు ఒక బిండ... రెండు పైసలకు ఒక బిండ ఈ పలుకులతోనే అతని ప్రాణం దేహాన్ని విడిచింది.

వాస్తవం ఏమిటంటే మరణ సమయం.: మొత్తం మనిషి జీవితానికి సారాంశ గడియలాంటిది. ఎవడయితే జీవితాంతం మనస్ఫూర్తిగా 'లా ఇలాహ ఇల్లల్లాహ్' వచన కర్తవ్యాలను నెరవేరుస్తాడో అటువంటి అదృష్టవంతుని నోటినుంచే మరణ సమయంలో లా ఇలాహ ఇల్లల్లాహ్ అన్న పలుకులు వెలువడుతాయి. సమాధిలో ప్రశ్నించబడే ప్రశ్నల సమాధానాల సంగతి కూడా అంతే. తమ జీవితం మొత్తం ఆ ప్రశ్నల సమాధానాలకు అనుగుణంగా గడిపినవారు మాత్రమే వాటికి సరైన సమాధానాలు ఇవ్వగలుగుతారు.

https://teluguislam.net


'మర్రబ్బుక?' అన్న ప్రశ్నకు 'అష్హదు అల్లాఇల్లాహ ఇల్లల్లాహ్' అనే సమాధానం చెప్పేవాడు జీవితాంతం నిజంగా అల్లాహ్‌ను మాత్రమే తన ఆరాధ్యునిగా భావించి ఉంటాడు. ఒక్క అల్లాహ్ యందే మనసును లగ్నం చేసుకొని ఉంటాడు. ఒక్క అల్లాహ్‌నే తన అనుగ్రహమూర్తిగా, ఆపదమొక్కులవాడిగా భావించి ఉంటాడు. ఒక్క అల్లాహ్‌నే తన సహాయకుడిగా, కష్టాలనుంచి గట్టెక్కించే వాడిగా భావించి ఉంటాడు. తన అదృష్టానికి, తన జీవన్మరణాలకు ఒక్క అల్లాహ్‌నే యజమానిగా భావించి ఉంటాడు. ఆయన కొరకే మొక్కుబడులు చేసుకొని ఉంటాడు. త్యాగాలు, నజరానాలు ఆయనకే సమర్పించుకొని ఉంటాడు. ఆయన పేరు మీదే నమాజులు చేసి ఉంటాడు. ఉపవాసాలు పాటించి ఉంటాడు. ఆయన పేరు మీదే దానధర్మాలు చేసి ఉంటాడు. కేవలం ఆయనకు మాత్రమే భయపడి ఉంటాడు. కాని దీనికి భిన్నంగా తన అదృష్టంలో, తన జీవన్మరణాల వ్యవహారాల్లో ఇతరుల్ని కూడా భాగస్తులుగా భావించినవాడు, అల్లాహ్‌తోపాటు ఇతరులు కూడా తన అనుగ్రహమూర్తులని, ఆపదమొక్కులవారని తలంచినవాడు, ఇతరుల్ని తన సహాయకులుగా, ఆపదల నుంచి గట్టెక్కించేవారిగా భావించినవాడు, అల్లాహ్‌తో పాటు ఇతరుల పేరున కూడా మొక్కుబడులు చేసుకొని వారికి త్యాగాలు, నజరానాలు సమర్పించుకున్నవాడు, అల్లాహ్‌తో పాటు ఇతరుల పేరున కూడా నమాజు చేసినవాడు, వారికోసం దానధర్మాలు చేసినవాడు-అట్లాంటివాడి నోటి నుంచి లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యదేవుడు లేడు) అనే పలుకులు ఎలా వెలువడుతాయండీ?!

రెండవ ప్రశ్న విషయం కూడా అంతే-'మన్నబియ్యుక' (నీ ప్రవక్త ఎవరు)? అన్న ప్రశ్నకు సమాధానం పైకి చాలా సులువుగా, సంక్షిప్తంగా అనిపించవచ్చు. అంటే 'అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వరసూలుహూ' అని.కాని ఈ సులభమైన, సంక్షిప్తమైన సమాధానం కూడా మొత్తం మనిషి క్రియాత్మక జీవితంతో సంబంధం కలిగి ఉంది. ఎవడయితే నమాజ్ రోజాలు, దానధర్మాల దగ్గరినుంచి లేవటం, కూర్చోవటం,పడుకోవటం, మేల్కొనటం, తినటం త్రాగటం వరకు, వ్యాపార లావాదేవీల దగ్గర్నుంచి వివాహం, జీవన్మరణాలు మొదలగు వ్యవహారాలన్నిటిలో కేవలం దైవప్రవక్త పద్ధతిని మాత్రమే అనుసరించి ఉంటాడో, ఆయన్నే తన నేతగా, మార్గదర్శిగా భావిస్తాడో, ఆయన్నే తన ఇమాముగా, తన పూర్వీకునిగా భావిస్తాడో, ఆయన వ్యక్తిత్వాన్నే తనకొరకు ఆదర్శవంతమైనదిగా భావిస్తాడో, తన తల్లిదండ్రులు, భార్యాపిల్లలు ఇతర వ్యక్తులందరికంటే ఆయన్నే తన అభిమానపాత్రునిగా తలపోశాడో అలాంటివాని నోటి నుంచే ఈ ప్రశ్నకు సరైన సమాధానం వస్తుంది. దీనికి భిన్నంగా అడుగడుగునా ఆయన హదీసులకు బదులు ఇమాముల అభిప్రాయాలకు పెద్దపీట వేసేవాడు, ఆయన సలహాలకు బదులు తమ గురువుల, పెద్దల మాటలకు విలువనిచ్చేవాడు, ఆయన

https://teluguislam.net


సున్నతులకు బదులు ఉలమాలు ప్రచారం చేసిన బిద్అత్‌లకు ప్రాధాన్యతనిచ్చేవాడు, ఆయన ప్రబోధనలకు బదులు తమ మహాత్ముల ప్రబోధనలకు ప్రాముఖ్యతనిచ్చినవాడు, ఆయన ప్రవచనాల కన్నా తమ హజ్రత్‌జీల స్వప్న విశేషాల మీద, వారి కలల మీద నమ్మకముంచేవారు, దైవప్రవక్తను వదలి ఇతర మత, రాజకీయ వ్యక్తులను అభిమానించే వారు, ఇట్లాంటి వారి నోటి నుంచి ఈ ప్రశ్నకు సరైన సమాధానం వస్తుందండీ?!

మూడో ప్రశ్న ధర్మానికి సంబంధించినది. 'మా దీనుక'... అంటే నీ ధర్మం ఏది? అని. అరబీ భాషలో దీన్ అనే పదానికి చాలా విస్తృతమైన అర్థం ఉందని తెలుసుకోండి. మనిషి ఏ విధంగానయితే జీవితం గడుపుతాడో ఆ విధానమే అతని ధర్మం అనిపించు కుంటుంది. కనుక ఎవరయితే జీవితాంతం ఇస్లామీయ జీవన విధానం ప్రకారం నడుచు కుంటాడో, ఇస్లామీయ జీవన సరళిని అవలంబిస్తాడో, ఇస్లామీయ సంస్కృతీ నాగరికతలను ప్రాణప్రదంగా భావిస్తాడో, ఇస్లామీయ చట్టాలను, ఆదేశాలను ఖచ్చితంగా పాటిస్తాడో ఇస్లామీయ చిహ్నాలను గౌరవిస్తాడో అతని నోటినుంచే సరైన సమాధానం వస్తుంది. దీనికి భిన్నంగా యూద, క్రైస్తవ హైందవ జీవన. విధానాలను అవలంబించినవాడు, వారి సంస్కృతీనాగరికతలను ఇష్టపడ్డవాడు, వారిచిహ్నాలను అభిమానించినవాడు, వారి పండుగలు జరుపుకున్నవాడు, వారి మత, రాజకీయ, సామాజిక, సాహితీ వ్యక్తులను అభిమానించినవాడు, వారి చట్టాలను అనుసరించినవాడు, అట్లాంటివాడి నోటి నుంచి 'నా ధర్మం ఇస్లాం' అన్న సమాధానం వస్తుందండీ?

పరీక్ష చిన్నదైనా పెద్దదైనా దాని మానసిక ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందంటే చాలామంది పరీక్షకు ముందే బెంబేలెత్తిపోతారు. ప్రిపేర్ అవకుండా పరీక్షకు హాజరయ్యే పిల్లల విషయం అటుంచినా సంవత్సరం మొత్తం ఎంతో కష్టపడి చదివినవారు కూడా కొన్ని కొన్ని సందర్భాల్లో ఎంతగా బెదిరిపోతారంటే పరీక్షహాల్లో కూర్చున్న తర్వాత వారికి బాగా జ్ఞాపకమున్న ప్రశ్నలు కూడా గుర్తురాకుండా పోతాయి. మరి చూడబోతే ఇహలోకపు పరీక్షలో ఒక ఫెయిల్యూర్ భయం తప్ప మరే భయమూ ఉండదు!

ఒక్క క్షణం ఊహించండి. సమాధి చీకటి, ఒంటరితనం, అమానుష ఆకారాలు, వారి చేతుల్లో గదలు, జీవితంలో మొదటిసారి ఎదురయిన పరిస్థితి, సమాధానాలు చెప్పకపోతే శిక్షపడుతుందేమోనన్న భయం, విడిపించేవాడెవడూ ఉండడు, పారిపోవటానికీ అవకాశం ఉండదు. ప్రజల్లో చాలామంది ఎలా ఉంటారంటే, రాత్రిపూట హఠాత్తుగా ఎవరయినా వచ్చి తలుపుతడితేనే భయంతో వారి రక్తం చల్లబడిపోతుంది. పోలీసు సిబ్బందిలోని ఒక మామూలు సిపాయి తమ దగ్గరకు వస్తుండగా చూస్తే ఒళ్ళంతా చెమటలు పడతాయి. తలుపులు మూసివున్న గదిలో కూర్చొని ఉండగా హఠాత్తుగా కరెంటుపోతే కొన్ని నిమిషాలు చీకట్లో ఉండటానికే భయపడతాడు మనిషి. అలాంటి

https://teluguislam.net


భయంతోనే దైవప్రవక్తను ఆయన అనుచరులు అడిగారు, "దైవప్రవక్తా! మనిషి తన తలదగ్గర దైవదూత గదపట్టుకొని ఉండటం చూస్తే (భయంతో అక్కడికక్కడే) మట్టి విగ్రహమైపోతాడు. (మరి అతను సమాధానం ఏం చెప్పగల్గుతాడు?)" అని. దానికాయన సమాధానమిస్తూ "విశ్వాసులకు దేవుడు తౌహీద్ సద్వచన చలువతో సమాధిలో జరిగే ప్రశ్న-సమాధానాల విషయంలో స్థిరంగా ఉంచుతాడు" అని చెప్పారు. (బజ్జార్). ఇతర అనుచరుల ప్రశ్నలకు కూడా ఆయన ఇదే సమాధాన మిచ్చారు. దీని ద్వారా ఈ క్రింది రెండు విషయాలు బోధపడుతున్నాయి:

1) సమాధి పరీక్షలో విజయం సాధించటానికి మొట్టమొదటి మరియు ప్రథమ నియమం ఏకదైవ విశ్వాసం. కనుక ప్రతి ముస్లిం తన విశ్వాసాన్ని చిన్నపెద్ద అన్ని రకాల షిర్క్‌ల నుంచి పవిత్రంగా, పరిశుద్ధంగా ఉంచుకోవాలి. ఆ తర్వాత తన ఆచరణలన్నిటికీ దాన్నే ఆధారంగా చేసుకోవాలి.

2) దైవ ప్రవక్త ప్రవచనం ద్వారా బోధపడుతున్న రెండో విషయం ఏమిటంటే తౌహీద్ విశ్వాసాన్ని అనుసరించి ఆచరించినప్పటికీ సమాధి పరీక్షలో స్థయిర్యం అనేది కేవలం అల్లాహ్ కరుణాకటాక్షాలతోనే ప్రాప్తమవుతుంది. కనుక విశ్వాసాలను, ఆచరణలను సంస్కరించుకున్న తర్వాత దైవసన్నిధిలో చేతులెత్తి ఆయన్ని దయాభిక్ష పెట్టమని వేడుకోవాలి.

رَبَّنَا ظَلَمْنَا اَنْفُسَنَا وَ اِنْ لَّمْ تَغْفِرْ لَنَا وَ تَرْحَمْنَا لَنَكُوْنَنَّ مِنَ الْخَاسِرِيْنَ

ఓ మా ప్రభూ! మేము మా ఆత్మలకు అన్యాయం చేసుకున్నాము. నీవు గనక మమ్మల్ని క్షమించకపోతే, మా మీద దయ జూపకపోతే మేము నష్టపోయేవారిలో కలిసిపోతాం. (ఆరాఫ్ సూరా. 33వ సూక్తి)

పైన పేర్కొనబడిన రెండు విషయాలనూ ఆచరిస్తే బలహీనులు, నిస్సహాయులైన తన పాపాత్మ దాసుల్ని అల్లాహ్ తప్పకుండా కరుణిస్తాడని ఆశించవచ్చు.

## నాల్గవ ప్రశ్న

పైన పేర్కొనబడిన మూడు ప్రశ్నలతోపాటు సమాధిలో ఇంకో ప్రశ్న కూడా అడగటం జరుగుతుంది. పై ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పిన వారికి, చెప్పలేకపోయినవారికి-ఇద్దరికీ ఈ ప్రశ్న వేయబడుతుంది. సరైన సమాధానం చెప్పిన అదృష్టవంతులను దైవదూతలు "మిమ్మా యుద్‌రీక"... ఈ విషయాలు నీకు ఎలా తెలిశాయి అని అడుగుతారు. దానికి విశ్వాసి....... "నేను దైవగ్రంథం చదివాను. దాన్ని విశ్వసించాను. దాన్ని ధృవీకరించాను" అని చెబుతాడు (అహ్మద్, అబూదావూద్). సరైన సమాధానం

https://teluguislam.net



చెప్పలేకపోయిన దురదృష్టవంతులను దైవదూతలు "నీవు తెలుసుకోలేదా" నీవు (ఖుర్‌ఆన్) చదవలేదా?" అని అడుగుతారు. ఆ తర్వాత అతని రెండు చెవుల మధ్య ఇనుపసుత్తెలతో కొడతారు. ఆ దెబ్బలకు అతను చాలా భయంకరంగా అరవటం మొదలుపెడతాడు. అతని అరుపుల్ని జిన్నుల, మానవులు తప్ప మిగతా సృష్టిరాశులన్నీ వింటాయి (బుఖారీ, అబూదావూద్).

విశ్వాసి మరియు అవిశ్వాసికి వేయబడిన ఈ నాల్గవ ప్రశ్న ద్వారా ఈ క్రింది విషయాలు బోధపడుతున్నాయి:

1) మున్కిర్, నకీర్ దూతలు వేసే మూడు ప్రశ్నలకు సరైన సమాధానాలు అందించగల గ్రంథం ఖుర్‌ఆన్ మాత్రమే.

2) ఖుర్‌ఆన్ గ్రంథాన్ని విశ్వసించి, దాన్ని పారాయణం చేసి, అర్థం చేసుకొని, దాన్ని ఆచరించినవారు మాత్రమే సమాధి శిక్షలో కృతకృత్యులౌతారు.

3) మరణానంతరం అవిశ్వాసి లేక బహుదైవారాధకుని మీద మొట్టమొదట నువ్వు దివ్యఖుర్‌ఆన్ ఎందుకు చదవలేదు, దాన్ని అర్థం చేసుకోవటానికి ఎందుకు ప్రయత్నించలేదు? అన్న నేరం మోపబడుతుంది.

4) దివ్యఖుర్‌ఆన్‌ను చదవని, అర్థం చేసుకోని నేరానికి ముద్దాయిని రెండు చెవుల మధ్య అనగా మెదడు మీద గదతో కొట్టడం జరుగుతుంది. దీని ద్వారా అర్థమయ్యేదేమిటంటే దేవుడు మెదడు దివ్యఖుర్‌ఆన్ చదవటం కోసం, దాన్ని అర్థం చేసుకోవటం కోసం ప్రసాదించాడు. కనుక ఏ లక్ష్యం కోసమైతే అది పుట్టించబడిందో దాన్ని ఆ లక్ష్యం కోసం వినియోగించని కారణంగా అవిశ్వాసికి ఈ శిక్ష విధించబడుతుంది.

పైన పేర్కొనబడిన నాలుగు సారాంశాలు చదివిన తర్వాత ముస్లిం అయిన ప్రతి వ్యక్తి ఖుర్‌ఆన్ చదవటం, దాన్ని అర్థం చేసుకోవటం, దాని ప్రకారం ఆచరించటం ఎంత అవసరమో తెలుసుకోవటం ఏమంత కష్టం కాదు. దివ్యఖుర్‌ఆన్ వల్ల శుభాలు, మేళ్లు, పుణ్యఫలాలు అనుగ్రహాలు కలుగుతాయన్న మాట ముమ్మాటికీ నిజమే. కాని ఖుర్‌ఆన్ అవతరణ ముఖ్యోద్దేశం మానవులకు సన్మార్గం చూపించటం. తద్వారా వారు అపమార్గాలకు లోనుగాకుండా, పరలోక శిక్షకు గురికాకుండా సురక్షితంగా ఉండగలగటం. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

﴿فَمَنِ اتَّبَعَ هُدَايَ فَلَا يَضِلُّ وَلَا يَشْقَىٰ﴾

నేను చూపిన మార్గం ప్రకారం నడుచుకున్నవాడు (ప్రపంచంలో) అపమార్గాలకు లోనుకాడు. (పరలోకంలోనూ) ఆపదలకు (శిక్షకు) గురికాడు. (తాహా సూరా 123వ సూక్తి). వేరొక చోట అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

https://teluguislam.net



﴿فَمَنْ تَبِعَ هُدَايَ فَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ﴾

నా మార్గాన్ని అనుసరించినవారికి ఎలాంటి భయాందోళనలుగాని, దుఃఖవిచారాలు గాని ఉండవు. (బఖర సూరా 38వ సూక్తి)

వేరే మాటల్లో ఆ విషయాన్ని మనం ఈ విధంగా కూడా చెప్పుకోవచ్చు. ఖుర్‌ఆన్ గ్రంథాన్ని పారాయణం చేయనివారు, దాని ప్రకారం నడుచుకోనివారు ప్రపంచంలో తప్పకుండా భ్రష్టత్వానికి గురౌతారు. అంతేగాకుండా పరలోకంలో కూడా శిక్షకు గురౌతారు. ఆ శిక్ష సమాధినుంచే ప్రారంభమవుతుంది. ఆ ప్రకారం మనం మన కష్టం, సమయం, శక్తి సామర్థ్యాలలోని ఎక్కువ భాగాన్ని దివ్యఖుర్‌ఆన్ విద్యను ఆర్జించటానికి వెచ్చిస్తూ ఉండాల్సింది. ఖుర్‌ఆన్ పారాయణ శ్రవణం మన మనోమస్తిష్కాలకు ప్రశాంతతను చేకూర్చేదిగా మారిపోవలసింది. ఉదయం సాయంత్రం మన ఇండ్ల నుండి ఖుర్‌ఆన్‌ను సుమధురంగా పారాయణం చేసేవారి గొంతులు వినపడుతూ ఉండాల్సింది. మనపిల్లలు యుక్త వయసుకు చేరుకోకముందే ఖుర్‌ఆన్ గ్రంథానికి ఎంత దగ్గరయి ఉండాలంటే జీవితాంతం దాని పారాయణాన్ని, అవగాహననూ, పరిశోధనను తమ ప్రాణప్రద కార్యంగా భావించాలి. కాని శోచనీయమైన విషయం ఏమిటంటే ఈ రోజు ఆ ఖుర్‌ఆన్ పట్లనే అన్నిటికంటే ఎక్కువ అజాగ్రత్త, నిర్లక్ష్యం చూపటం జరుగుతోంది. మరి చూడబోతే ప్రపంచంలో, సమాధిలో, పరలోకంలో మన విజయానికి పూచికత్తు అదే!

మనకు ప్రతిరోజూ వార్తాపత్రికలు చదవటానికి ఒకటిరెండు గంటల సమయం దొరుకుతుంది. కాని దివ్యఖుర్‌ఆన్ చదవటానికి, అర్థం చేసుకోవటానికి, యోచన చేయటానికి పట్టుమని పది నిమిషాలయినా దొరకవు. ఎంతటి శోచనీయమైన వాస్తవమండీ ఇది! ప్రియమైన మన దేశంలో తొంభై శాతం కుటుంబాలు తమ కుటుంబ సభ్యులందరితోపాటు టి.వి. ముందు కూర్చొని ప్రియాతి ప్రియమైన తమ జీవితంలోని ఎన్నో విలువైన గంటలసమయం వృధా చేస్తారు. కాని తమ కుటుంబ సభ్యులతోపాటు కూర్చొని ఖుర్‌ఆన్ చదవటానికి, చదివించుకోవటానికి వారికి కొన్ని నిమిషాలయినా దొరకవు. పిల్లాడికి నాలుగైదు యేండ్లు రాగానే అతన్ని ఏ స్కూల్లో చేర్పించాలి, ఏం చదివించాలి, పెద్దయిన తర్వాత అతను ఏం కావాలి అనే ఆలోచనలతో తల్లిదండ్రులు అతని ప్రాథమిక విద్యాశిక్షణల కోసం ప్రయత్నాలు మొదలుపెడతారు. కాని జీవితాంతం పిల్లలకు ఖుర్‌ఆన్ విద్య నేర్పించాలన్న ధ్యాసరాదు. ప్రాపంచిక విద్యార్జన కోసం తల్లిదండ్రులు ధనం నీళ్లలా ఖర్చుపెడతారు. కాని ఖుర్‌ఆన్ విద్య నేర్పించటానికి అందులో వందో వంతు ఖర్చుపెట్టటానికయినా వారి మనసొప్పదు. అందుకే 24,25 యేండ్ల వయస్సు వచ్చినప్పటికి మన విద్యార్థుల చేతుల్లో ఉపాధి అన్వేషణకు మూడు, నాలుగు డిగ్రీలుంటాయి. కాని యాభై అరవై సంవత్సరాలు వచ్చినప్పటికి కూడా వారికి దివ్యఖుర్‌ఆన్‌ను కనీసం ఒక్కసారన్నా పూర్తిగా చదివే భాగ్యం ఉండదు.

https://teluguislam.net



ఖుర్ఆన్ పట్ల ఈ విధమైన అజాగ్రత్త, నిర్లక్ష్యానికి ఒక కారణం దివ్యఖుర్ఆన్ ప్రాముఖ్యత గురించి తెలియకపోవటం. ఈ ప్రపంచంలో మనకు ఎదురయ్యే వ్యక్తిగత, సామాజిక సమస్యలకు, దుఃఖవిచారాలకు, రోగాలకు చికిత్స ఖుర్ఆన్ ఒక్కటేననీ, ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించి వెళ్ళిపోయిన తర్వాత పితృలోకంలో కూడా మన ముక్తికి, భద్రతకు సాధనం ఈ ఖుర్ఆనేననీ, ఆ తర్వాత పరలోకంలో దైవసన్నిధిలో మన గురించి సిఫారసు చేసేది కూడా ఈ ఖుర్ఆన్ గ్రంథమేనని మనకు తెలియదు. ఖుర్ఆన్ రూపంలో అల్లాహ్ మనకు ఎంతటి గొప్పవరాన్ని ప్రసాదించాడో కూడా తెలుసుకోలేని నిస్పృహలో ఉన్నాం మనం. అందుకని మనం ఖుర్ఆన్ ద్వారా ఋజుమార్గం పొందే బదులు దాన్ని కేవలం శుభశ్రేయాలు ఇచ్చే గ్రంథంగా తలపోసి వివాహ వేడుకల సమయంలో కూతురికి కానుకగా ఇవ్వటం, కొడుకుని సాగనంపేటప్పుడు అతని ఛాయలోనుంచి తీసుకెళ్ళటం, గొడవలు, తగాదాలు జరిగినప్పుడు ప్రమాణాలు, సాక్ష్యాల కోసం ఉపయోగించటం, జిన్నాతులను పారదోలటానికి తావీజులుకట్టటం, అవసరమొస్తే దీనిద్వారా శకునం చూడటం, మృతులకు పుణ్యప్రాప్తి జరగటం కోసం దానిని పారాయణం చేయటం. ఇవే ఖుర్ఆన్ అవతరణ ముఖ్యోద్దేశాలుగా భావిస్తున్నారు. ఇది అచ్చం ఎలా ఉందంటే ఒక పల్లెవాసి చేతికి వజ్రాలు, మణుల నిధి దొరికితే అతను వాటిని రాళ్లనుకొని నిర్లక్ష్యంగా పారేస్తున్నట్లుంది.

ఖుర్ఆన్‌కు దూరమయిపోవటానికి, దాని విషయంలో అజాగ్రత్తకు పాల్పడటానికి మరో కారణం దివ్యఖుర్ఆన్ పఠనం చాలా కష్టమని భావించటం. కేవలం పండితులు మాత్రమే దాన్ని చదివి అర్థం చేసుకోగలరు, సామాన్యులకు అది సాధ్యం కాని పని అని తలపోయటం. ఆ మాటే గనక నిజమయితే సమాధిలో ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేకపోయేవారి మీద 'ఖుర్ఆన్ చదవలేదు. దాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించలేద'న్న అభియోగం ఎందుకు మోపబడాలండీ? అల్లాహ్ కూడా ఖుర్ఆన్‌లో ఈ అపోహను త్రోసిపుచ్చుతున్నాడు. అల్లాహ్ సెలవు: ﴿وَلَقَدْ يَسَّرْنَا الْقُرْآنَ لِلذِّكْرِ فَهَلْ مِن مُّدَّكِرٍ﴾ మేమీ ఖుర్ఆన్‌ని ప్రజలు గ్రహించటానికి సులభతరం చేశాం; మరి దీన్నుండి హితబోధ గ్రహించేవారు ఎవరైనా ఉన్నారా?" (ఖమర్ సూరా, 17వ సూక్తి)

అయితే ఖుర్ఆన్‌లోని కొన్ని వాక్యాలను అర్థం చేసుకోవటం కష్టమే. ఈ విషయాన్ని మేమూ ఒప్పుకుంటాం. కాని ఆ కారణంగా మొత్తం ఖుర్ఆన్‌నే చదవకుండా వదిలేయాలన్న వైఖరి సమంజసమేనా? ఏ విద్యార్థికయినా రసాయన లేక భౌతిక శాస్త్రంలోని కొన్ని సూత్రాలు అర్థం చేసుకోవటం కష్టంగా ఉంటే అతని తల్లిదండ్రులు అతనితో "బాబూ! ఈ చదువు వదిలెయ్యి.ఇది చదవటం నీ వల్లకాదు" అని ఎన్నడూ అనరు. పైగా పరీక్షలో పాసవటం కోసం అత్యంత ఖరీదైన ట్యూషన్లు పెట్టించి మరీ

https://teluguislam.net



అతనికి ఆ శాస్త్రం బోధించటం జరుగుతుంది. ప్రపంచం విషయంలో మన మెదడు మనచేత ఈ పని చేయిస్తుంది. మరి ధర్మం విషయంలో మనం ఎందుకింత అమాయకంగా, మూర్ఖంగా ప్రవర్తిస్తాం? ఖుర్ఆన్ పఠనంలో కష్టమైన సందర్భాలు ఎదురైతే వాటిని అర్థం చేసుకోకుండా ఎందుకని వదిలేస్తున్నాం? నిజానికి మన వ్యవహారం ఇందుకు పూర్తిగా వ్యతిరేకంగా ఉండాల్సింది. ఖుర్ఆన్ గ్రంథాన్ని పూర్తి శ్రద్ధాసక్తులతో పఠించాలి. ఎక్కడైనా ఏదయినా విషయం అర్థం కాకపోతే ఏ ధర్మజ్ఞానినయినా అడిగి తెలుసుకోవాలి. సమాధి పరీక్షలో కృతకృత్యులవటానికి సాధ్యమైనంతవరకు కృషి చేయాలి. అంతేగాని మొదటిరోజే ఖుర్ఆన్ చదవనని ప్రతిజ్ఞ చేసుకొని తనకు పరాజయం ఖాయమని నిరూపించుకోరాదు.

ఖుర్ఆన్ పఠనానికి దూరమవటానికి గల మరొక కారణమేమిటంటే, కొంతమంది ఎక్కువ జ్ఞానం ఆర్జించటం వినాశకరంగా భావిస్తారు. వీరి అభిప్రాయంలో ఇబ్లీసు కూడా మహాజ్ఞానే. జ్ఞానం వల్లనే అతను మార్గభ్రష్టుడయ్యాడు. కనుక తమకు ఎంతవరకు తెలుసో అంతవరకు ఆచరిస్తే చాలు (మరిన్ని విషయాలు తెలుసుకోవాల్సిన అవసరం లేదు).

ఈ అపోహ కూడా పూర్తిగా షైతాన్ కుశంక. ఎందుకంటే ఇబ్లీసు తన జ్ఞానం మూలంగా కాదు నాశమయింది, తన అహంకారం మూలంగా నాశనమయ్యాడు. (బఖరా సూరాలోని 34వ సూక్తి గమనించండి) అల్లాహ్ విద్యావంతులను ఈ వాక్యాలతో ప్రశంసించాడు: ﴿إِنَّمَا يَخْشَى اللَّهَ مِنْ عِبَادِهِ الْعُلَمَٰٓؤُا﴾

అల్లాహ్ దాసుల్లో జ్ఞానులే ఆయనకు భయపడతారు. (ఫాతిర్ సూరా 28వ సూక్తి). వేరొక చోట అల్లాహ్ ఇలా అంటున్నాడు:

﴿قُلْ هَلْ يَسْتَوِى الَّذِينَ يَعْلَمُونَ وَالَّذِينَ لَا يَعْلَمُونَ﴾

ఓ ముహమ్మద్ (సల్లం) వారిని అడగండి జ్ఞానులు, అజ్ఞానులు సమానులు కాగలరా? (జుమర్ సూరా 9వ సూక్తి)దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ దేన్నయితే ప్రశంసించాడో అది మానవుల పాలిట వినాశకారి అవుతుందా లేక ముక్తికి దోహదకారి అవుతుందా?

కొంతమంది వృద్ధాప్యం మూలంగా ఖుర్ఆన్ చదవటానికి బిడియపడతారు. తటపటాయిస్తారు. నిజానికి ఇది కూడా ఒక నకారాత్మక ఆలోచనే. ప్రాపంచిక వ్యవహారాల్లో నయితే ప్రతి మనిషి జీవితపు చివరి శ్వాసవరకూ కృషి సలుపుతూ ఉంటాడు. ఎన్నడైనా అందులో తటపటాయించటం గాని బిడియపడటం గాని చేయడు. మరి ధర్మం విషయంలో ఈ విధంగా ఆలోచించటం సమంజసమేనా అండీ? దైవ ప్రవక్త అనుచరుల్లో కొందరు యాభై యేళ్ల వయసులో ముస్లింలయ్యారు. మరికొందరు

https://teluguislam.net



అరవై ఏళ్ల వయసులో ఇస్లాం స్వీకరించారు. వాళ్లంతా ఆ తర్వాతే దివ్యఖుర్‌ఆన్ చదవటం నేర్చుకున్నారు. కొందరు దాన్ని కంఠస్థం కూడా చేసుకున్నారు. దైవప్రవక్త (సల్లం) "ధర్మ విద్యను అర్జించటం ప్రతి ముస్లిం విధి" అని ప్రవచించారు (తబ్రానీ). దానికోసం ఆయన వయోపరిమితులేవీ నిర్ధారించలేదు. కనుక సత్యం బోధపడగానే ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, తటపటాయించకుండా ఖుర్‌ఆన్ చదవటం మొదలెట్టాలి.

ఖుర్‌ఆన్‌కు దూరమవటానికి వేరొక కారణం-వివిధ రకాల పంజ్ సూరాలు, ఇతర పుస్తకాలు, ఆనవాయితీలు. చాలామంది వీటిని ఖుర్‌ఆన్ పారాయణాన్ని ఏ విధంగా దైనందిక కార్యంగా చేసుకోవాలో ఆ విధంగా చేసుకుంటారు. ఇక ఆ తర్వాత ఖుర్‌ఆన్‌ను ముట్టుకోవాల్సిన అవసరం కూడా ఉండదనుకుంటారు. ఖుర్‌ఆన్‌లోని కొన్ని సూరాలకు ప్రాధాన్యత ఉందన్న మాట వాస్తవమే. కాని ఆ కొన్ని సూరాలు మాత్రమే చాలు అనుకొని మిగతా ఖుర్‌ఆన్‌ను చదవకుండా ఉండాలని దాని భావం కాదు. పైగా ప్రతిరోజూ ఖుర్‌ఆన్ పారాయణం చేస్తూ, దాని భావాన్ని ఆకళింపు చేసుకుంటూ, ఆ తర్వాత ఇంకా పుణ్యం కావాలనుకుంటున్న వ్యక్తి ఆ సూరాలు పఠించాలని దాని అసలు భావం. అలాగే కొన్ని ధార్మిక సంఘాలు తాము సాధించదలచిన ప్రత్యేక లక్ష్యాలకోసం తమ కార్యకర్తల కొరకు ప్రత్యేకమైన సాహిత్యం, స్లిప్పులు తయారు చేస్తారు. అలా చేయటం తప్పుకాదుగాని అసలు ఎన్నడూ ఖుర్‌ఆన్ తెరిచి చదివే అవకాశం లేకుండా తమ సందేశమంతటికీ ఆ సాహిత్యమే ఆధారమన్నట్లు దానిపఠనాన్ని నిర్బంధం చేయటం మాత్రం అక్షరాలా తప్పు. ఖుర్‌ఆన్‌లోని కొన్ని ప్రత్యేకసూక్తులు చదువుకోవటం కాదు కావాల్సింది, మొదటినుంచి చివరిదాకా ఖుర్‌ఆన్ మొత్తం చదివి దాని ఆదేశాలన్నిటినీ ఆకళింపు చేసుకోవాలి, దాని ప్రకారం ఆచరించాలి. ఇది ఖుర్‌ఆన్ అసలు ఉద్దేశ్యం.

సామాన్య ప్రజానీకాన్ని ఖుర్‌ఆన్ పఠనానికి దూరంగా ఉంచటంలో బరి తెగించి కీలకమైన పాత్రను పోషించినది సూఫీ మతస్తుల విశ్వాసాలు. వారి దృష్టిలో ఖుర్‌ఆన్‌కు అంతరంగం, బాహ్యం అని రెండుంటాయి. సూఫీ మతస్తుల దృష్టిలో ఖుర్‌ఆన్ యొక్క ఆంతరంగిక భావం, బాహ్యార్థం కంటే గొప్పది, ప్రధానమైనదీను. అది చదువుతో అబ్బేదికాదు. ఒకరి హృదయం నుంచి మరొకరి హృదయానికి అందుతూ ఉంటుంది. సూఫీల్లో "ఇల్మ్ దర్సీ నబూద్, దర్ సీనా బూద్" అనే ఒక నానుడి ప్రఖ్యాతిగాంచినది. అంటే విద్య అనేది చదువుకునే చదివించే వస్తువు కాదు, అది హృదయాల ద్వారా లభిస్తుంది అని దాని భావం. మరికొందరు సూఫీలు ఇంకో అడుగు ముందుకు వేసి

"اَلْعِلْمُ حِجَابُ الاَكْبَر"

అని అంటారు. అంటే 'ఖుర్‌ఆన్ విద్య వేదాంత మార్గంలో అన్నిటికంటే పెద్ద అడ్డంకి' అని దాని భావం. ఆలోచించండి! ఏ మతమైతే ఖుర్‌ఆన్ పఠనానికి దూరంగా ఉండాలనే భావన మీద ఆధారపడి ఉందో ఆ మతంలో ఖుర్‌ఆన్‌ను ముట్టుకోవటానికయినా ఎవడు సిద్ధపడతాడండీ?

https://teluguislam.net



దివ్య ఖుర్‌ఆన్ పట్ల మన ఈ నిర్లక్ష్యం, అజాగ్రత్త మనల్ని తప్పకుండా నష్టానికి, పశ్చాత్తాపానికి గురి చేస్తుంది. దీన్నుంచి బయటపడటానికి ఒక్కటే మార్గం. మనలోని ప్రతి ఒక్కరూ తమకు దొరికే తొలి తీరికలోనే ఖుర్‌ఆన్ పఠించటం మొదలుపెట్టాలి. గత జీవితంలో ఖుర్‌ఆన్ పట్ల కనబరిచిన నిర్లక్ష్య పరిహారం కోసం అన్ని విధాల కృషి చేయాలి. ఖుర్‌ఆన్ మనకు ఈ ప్రపంచంలో సన్మార్గాన్ని, సద్బుద్ధిని శ్రేయోశుభాల సంపదలను ప్రసాదించటమే గాక సమాధిలో స్థిరత్వాన్ని కూడా ప్రసాదిస్తుంది. పరలోకంలో ముక్తికి దోహదకారిగానూ పరిణమిస్తుంది. -ఇన్షా అల్లాహ్

## సమాధి ఉపద్రవం నుంచి కాపాడే ఆచరణలు

సమాధి ఉపద్రవమంటే మున్కిర్, నకీర్ ప్రశ్నలతోపాటు సమాధిలో విధించబడే శిక్ష కూడా అనిఅర్థం. కనుక ఒక వ్యక్తి మున్కిర్ నకీర్ ప్రశ్నల నుంచి, సమాధి శిక్ష నుంచి-రెండింటి నుంచి-సురక్షితంగా ఉన్నప్పుడే అతను సమాధి ఉపద్రవం నుంచి సురక్షితంగా ఉన్నట్లవుతుంది. లేదా మున్కిర్‌నకీర్‌లు ప్రశ్నలు వేసినా అల్లాహ్ తన అనుగ్రహంతో అతని మనసుకి స్థిరత్వాన్ని ప్రసాదించి ఆ తర్వాత తన అనుగ్రహంతోనే అతని శిక్షార్హమైన పాపాలను క్షమించి అతన్ని సమాధి ఉపద్రవం నుంచి కాపాడతాడు. సమాధి ఉపద్రవం నుంచి సురక్షితంగా ఉండటమంటే భావం ఇది కూడా కావచ్చు. వాస్తవం అల్లాహ్‌కే బాగా తెలుసు.

ఈ క్రింది ఆచరణలు సమాధి ఉపద్రవం నుంచి కాపాడతాయి:

1) దైవ మార్గంలో ప్రాణాలు కోల్పోవటం :- దైవ ప్రవక్త ప్రవచనం, "దైవమార్గంలో ప్రాణాలు అర్పించే ఆచరణ సమాధి ఉపద్రవం నుంచి సురక్షితంగా ఉంచుతుంది" (నసాయి).

2) మురాబితా :- అంటే ఇస్లామీయ రాజ్య సరిహద్దులకు లేక ఇస్లామీయ సైన్యానికి కాపలాకాయటం. ఈ ఆచరణ కూడా సమాధి ఉపద్రవం నుంచి కాపాడుతుంది. (తిర్మిజీ)

3) ముల్క్ సూరాను అత్యధికంగా పారాయణం చేయటం :- దైవప్రవక్త ప్రవచనం, "ముల్క్ సూరా సమాధి ఉపద్రవాన్ని అడ్డుకుంటుంది" (హాకిమ్). దైవప్రవక్త (సల్లం) ప్రతిరోజూ పడుకునే ముందు ముల్క్ సూరా పారాయణం చేసే వారు అన్న విషయం గమనార్హం. (అహ్మద్, తిర్మిజీ, దారిమి)

4) దివ్యఖుర్‌ఆన్ పారాయణం:- దివ్యఖుర్‌ఆన్ పారాయణం కూడా సమాధి ఉపద్రవం నుంచి కాపాడే ఆచరణే. (తబ్రానీ)

https://teluguislam.net



5) మస్జిద్ వైపు వేసే అడుగులు: మస్జిద్ వైపు వేసిన అడుగులు కూడా మనిషిని సమాధి ఉపద్రవం నుంచి సురక్షితంగా ఉంచుతాయి. (తబ్రానీ)

6) నమాజు 7) ఉపవాసాలు 8) జకాతు 9) నఫిల్ (స్వచ్ఛంద) దానధర్మాలు, 10) నఫిల్ నమాజు 11) బంధువులతో సత్సంబంధాలు 12) ప్రజలకు ఉపకారం చేయటం.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: సమాధిలో యాతన దూత (మృతుని దగ్గరకు) తలవైపు నుంచి వెళ్ళాలనుకుంటాడు. కాని నమాజు అతన్ని ఆపి "ఇటునుంచి దారిలేదు, వేరే వైపు నుంచి వెళ్ళు" అని అంటుంది. ఆ దూత మృతుని కుడివైపు నుంచి రావాలనుకుంటాడు. అంతలో ఉపవాసం అడ్డుకొని "ఇటు నుంచి దారిలేదు. వేరే దారి గుండా వెళ్ళు" అంటుంది. ఆ దూత ఎడమ వైపు నుంచి దగ్గరికి వెళ్తాడు. కాని జకాతు అతన్ని ఆపి "ఇటునుంచి దారి లేదు. వేరే దారి గుండా వెళ్ళు" అని అంటుంది. ఆ తర్వాత దూత కాళ్లవైపు నుంచి దగ్గరికి వెళ్ళబోతాడు. అప్పుడు ఇతర సత్కార్యాలు ఉదా: దానధర్మాలు, బంధువులతో సత్సంబంధాలు, ప్రజోపకారం మొదలగునవన్నీ అతన్ని అడ్డుకొని "ఇటు నుంచి దారి లేదు. వేరే దారి గుండా వెళ్ళు" అని అంటాయి.

(ఇబ్నె హిబ్బాన్).

పైన పేర్కొనబడిన పన్నెండు ఆచరణలు కాకుండా సమాధి ఉపద్రవం నుంచి ముక్తి పొందటానికి కారణమయ్యే సందర్భాలు ఇంకా రెండు ఉన్నాయి. వాటిలో మొదటిది గురువారం రాత్రి లేక శుక్రవారం రోజు మరణించటం. రెండోది, ఉదర సంబంధ వ్యాధి. అయితే ఈ రెండు సందర్భాలూ మనిషి అధీనంలో లేవు.

నమాధి ఉపద్రవాలనుంచి కాపాడే ఆచరణల ఆధారంగా మేము మా పాఠకమహాశయుల దృష్టిని కాస్త ఇటు కూడా మళ్ళించాలనుకుంటున్నాం. ఇస్లాం ధర్మంలోని ఆదేశాలన్నీ కూడా పరస్పరం ఏ విధంగా ముడివడి ఉన్నాయంటే వాటిని ఒకదాన్నుంచి మరొకటి వేరు చేసి ఏదయినా ఫలితాన్ని నిర్ణయించటం చాలా పెద్ద తప్పు. ఉదాహరణకు ఎవరైనా గురువారం రాత్రిగాని శుక్రవారం పగలు గాని చనిపోయాడు. కాని మరోవైపు అతను నమాజులు ఎగవేసేవాడనుకోండి. శుక్రవారం రోజు మరణించటం అతనికి ఏ విధంగానూ ప్రయోజనదాయకం కాజాలదు. ఎవడైతే ఇస్లామీయ ప్రధానాంశాలను నిక్కచ్చిగా పాటిస్తాడో, తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు, బంధుమిత్రుల హక్కులను నెరవేరుస్తాడో, ధర్మాధర్మాల మధ్య విచక్షణ చూపుతాడో, ఇతర వ్యవహారాల్లో కూడా అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకు విధేయత చూపుతుంటాడో అతనికి మాత్రమే ఆ రోజు మరణం ప్రయోజనకరం కాగల్గుతుంది. అదే విధంగా ఎవరైనా ప్రతిరోజూ క్రమం తప్పకుండా ముల్క్ సూరా పారాయణం జరుపుతున్నప్పటికీ విధులను

https://teluguislam.net



ఎగవేస్తుంటే, వడ్డీ వ్యాపారాలు చేస్తుంటే, ఇతర ఘోరపాపాలకు పాల్పడుతుంటే అలాంటివారికి కేవలం ముల్క్ సూరా పారాయణం సమాధి శిక్ష నుంచి ఎట్లా కాపాడగలదండీ?!

పైన పేర్కొనబడిన ఆచరణలను ప్రత్యేకంగా ప్రస్తావించటంలోని మర్మం ఏమిటంటే, ఎవరయితే ఇస్లామీయ విధుల్ని నిక్కచ్చిగా పాటిస్తారో, ఘోరపాపాలకు దూరంగా ఉంటారో, ప్రతి వ్యవహారంలోనూ అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకు విధేయత చూపటానికి ప్రయత్నిస్తుంటారో ఆ తర్వాత పైన పేర్కొనబడిన ఆచరణల్లో ఏదయినా ఒకటి లేదా ఒకటి కంటే ఎక్కువ ఆచరణల మీద అతి ఎక్కువ శ్రద్ధ తీసుకుంటారో ఉదా: నఫిల్ నమాజులు చాలా ఎక్కువగా చేస్తే లేక అత్యధికంగా నఫిల్ ఉపవాసాలు పాటిస్తుంటే లేక బంధుత్వ సంబంధాల విషయంలో చాలా ఎక్కువగా శ్రద్ధ తీసుకుంటున్నట్లయితే లేక అల్లాహ్ మార్గంలో చాలా ఎక్కువగా డబ్బు ఖర్చుపెడ్తున్నట్లయితే అలాంటి వ్యక్తి కొరకు ఆ ఒక్క ఆచరణ (లేక ఒకటికంటే ఎక్కువ ఆచరణలు) దైవం తలిస్తే సమాధి ఉపద్రవం నుంచి ముక్తి పొందటానికి కారణభూతం కాగలదు. వాస్తవం అల్లాహ్‌కే బాగా తెలుసు.

ధర్మం విషయంలో మనిషి ఏ విధంగా షైతాన్ మోసంలో చిక్కుకొని ఉన్నాడన్న విషయాన్ని ప్రతి మనిషి తమ తమ ప్రాపంచిక వ్యవహారాల ద్వారానే సులువుగా అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఎవరికైనా మొదటిసారి విదేశాలకు ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు అతను సురక్షితంగా తన గమ్యానికి చేరుకోవటానికి మాటిమాటికి ఏ విధంగా ఆరా తీస్తుంటాడో కాస్త ఆలోచించండి. దారిలో ఎదురయ్యే ప్రతి చిన్న సమస్య గురించి తెలుసుకోవటం కోసం అతను అంతకుముందు ఆ దేశానికి వెళ్ళివచ్చిన వారినందరిని అడిగి సలహాలు తీసుకుంటుంటాడు. పనులన్నీ చట్టప్రకారం జరగాలనీ, దారిలో ఎలాంటి సమస్యలూ ఎదురుకారాదని పాస్‌పోర్టు, వీసా, టికెట్ల కోసం అడిగినంత డబ్బు కిమ్మనకుండా చెల్లిస్తాడు. ప్రయాణంలో వెంట ఉండరాని వస్తువేదయినా తన సామానులో ఉందేమో, మార్గమధ్యంలో చెకింగ్ చేసినప్పుడు దానివల్ల తన పరువు పోతుందేమోనని తన సామానును మాటిమాటికీ పరిశీలించుకుంటూ ఉంటాడు. విమాన మెక్కిన తర్వాత ప్రయాణంలో ఏవైనా అనూహ్యమైన సంఘటనలు సంభవిస్తే ఎలా బయటపడాలో తెలిపే ముందుజాగ్రత్త చర్యలను చాలా జాగ్రత్తగా అధ్యయనం చేస్తాడు. మొత్తానికి ప్రయాణంలో ఎదురయ్యే ప్రతి సమస్యను, ప్రతి కష్టాన్ని అధిగమించటం కోసం తనకు తెలుపబడే ముందుజాగ్రత్త చర్యలన్నిటిని పాటించటానికి అతను అన్ని విధాలా సిద్ధంగా ఉంటాడు. ఇది ప్రపంచ విషయం... ఇప్పుడు ధర్మం విషయం చూడండి... విశ్వంలో అందరికంటే సత్యవంతుడు, అత్యంత నిజాయితీపరుడు, అత్యంత

https://teluguislam.net



శ్రేయోభిలాషి, అమిత సానుభూతిపరుడు అయిన ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం మనకు ప్రాపంచిక జీవితం తర్వాత మొదలవబోయే ప్రయాణంలోని ఒక్కొక్క ప్రమాదం గురించి అప్రమత్తం చేశారు. అంతేకాదు, ఆ ప్రమాదాల నుంచి బయట పడే మార్గాలు కూడా సూచించారు. కాని మనలో ఆ ప్రమాదాల నుంచి బయటపడటం గురించి ఆలోచించేవారు, బయటపడే మార్గాలను అనుసరించటానికి ప్రయత్నించేవారు ఎంతమంది ఉన్నారు? అత్యధిక మంది ఈ ప్రమాదకరమైన ప్రయాణానికి ఒట్టి చేతులతోనే బయలుదేరుతున్నారు!

అల్లాహ్ మమ్మల్ని పైశాచిక ఎత్తుగడలనుంచి రక్షించుగాక! మాకు ధర్మం విషయంలో సత్యాన్ని అర్థం చేసుకొని దాన్ని పాటించే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్.

## సమాధిలో నమాజీకి సత్కారం

నమాజు ఇస్లాం ధర్మపు రెండవ ప్రధానాంశం. దీని ఘనత, విశిష్టతలకు సంబంధించి దైవప్రవక్త (సల్లం) నుంచి ఎన్నో హదీసులు ఉల్లేఖించబడ్డాయి. ఆయన ఇలా ప్రవచించారు: రోజుకి ఐదుసార్లు స్నానం చేసేవాడు మాలిన్యం, అశుద్ధతల నుంచి ఏ విధంగా పరిశుభ్రంగా ఉంటాడో ఐదుపూటల నమాజు చేసేవాడుకూడా పాపాలనుంచి అదే విధంగా పరిశుభ్రంగా ఉంటాడు (బుఖారీ ముస్లిం). వేరొక హదీసులో ఐదుపూటల నమాజు చేసేవారికి అల్లాహ్ స్వర్గం ఇస్తానని వాగ్దానం చేశాడని ఉంది (అహ్మద్, అబూదావూద్). దైవప్రవక్త (సల్లం) జీవితంలోని చివరి విల్లు కూడా నమాజు గురించే జరిగింది, 'ప్రజలారా! నమాజ్‌ను కాపాడుకోండి,మీ బానిసలను దృష్టిలో పెట్టుకోండి' అని హితోపదేశం చేశారాయన (ఇబ్నెమాజా).

సమాధి జీవితంలో నమాజు గొప్పదనానికి సంబంధించి గొప్ప విలక్షణమైన, ముఖ్యమైన కోణం ఒకటి మనముందుకు వస్తుంది. దైవప్రవక్త ప్రబోధనం ప్రకారం సమాధిలో ముంకిర్ నకీర్ దూతలు ఒక విశ్వాసిని లేపి కూర్చోబెట్టినప్పుడు అతనికి అప్పుడే సూర్యుడు అస్తమిస్తున్నట్టు కనిపిస్తుంది. ఆ తర్వాత అతనికి, ముంకిర్ నకీర్ దూతలకు మధ్య క్రింది విధంగా ఎంతో ఆసక్తికరమైన భేటి జరుగుతుంది.

ముంకిర్ నకీర్ : మీ దగ్గరికి పంపబడిన ఆయన గురించి మీ నమ్మకమేంటి?

విశ్వాసి : అడ్డు లెండి, (ముందు) నన్ను నమాజు చేసుకోనివ్వండి.

ముంకిర్ నకీర్ : నమాజు తర్వాత చేసుకుంటావుగాని ముందు మా ప్రశ్నలకు సమాధానం చెప్పు.

విశ్వాసి : ఆయన (అనగా ముహమ్మద్ (సల్లం)) గురించి మీరు నన్ను ఏం అడగాలనుకుంటున్నారు?

https://teluguislam.net



ముంకిర్ నకీర్ : మేం అడిగిందానికి సమాధానం చెప్పు.

విశ్వాసి : కాస్త అడ్డులెండి (ముందు) నన్ను నమాజు చేసుకోనివ్వండి.

మంకిర్ నకీర్ : నమాజు తర్వాత చేస్తావుగాని ముందు మా ప్రశ్నలకు సమాధానం కావాలి.

విశ్వాసి : (ఇందాకటి నుంచి చూస్తున్నాను) అసలు మీరు నన్ను దేని గురించి అడగాలనుకుంటున్నారు?

ముంకిర్ నకీర్ : మీ దగ్గరకు పంపబడిన వ్యక్తి (అనగా ముహమ్మద్ (సల్లం)) గురించి మీ నమ్మకమేంటి? ఆయన గురించి మీరు చెప్పే సాక్ష్యమేంటి?

విశ్వాసి : ముహమ్మద్ (సల్లం) దేవుని దాసులని నేను సాక్ష్యం చెబుతున్నాను. ఆయన అల్లాహ్ దగ్గరి నుంచి సత్యం తీసుకువచ్చారని కూడా నేను సాక్ష్యం చెబుతున్నాను.

ముంకిర్ నకీర్ : నువ్వు ఈ నమ్మకం మీదే జీవితం గడిపావు. ఈ నమ్మకం మీదే మరణించావు. దైవం తెలిస్తే (ప్రళయదినాన) తిరిగి ఈ నమ్మకం మీదే లేస్తావు. *

ముంకిర్ నకీర్ మరియు విశ్వాసికి మధ్య జరిగే సంభాషణలోని పదాలను శ్రద్ధగా చదివి ఆలోచించండి. ఒకవైపు సమాధిలో అంతకుముందెన్నడూ చూడని మొహాలు, అతి భయంకరమైన రూపాలు, మాట్లాడితేనే గర్జించేలాగుండే కంఠస్వరాలు దానికితోడు ఒంటరితనం, చీకటి, ఇరుకైన చోటు-ఇన్ని అసౌకర్యాలు ఉన్నప్పటికీ మరోవైపు విశ్వాసి పరిస్థితిని గమనించండి. అతనిలో కంగారు, ఆందోళన అన్నమాటే లేదు. అతను దైవదూతలతో ప్రశాంతంగా, హుందాగా మాట్లాడుతుంటే-ఒక యజమాని ముందు అతని నౌకర్లు నిలబడి మాటిమాటికి ఏదో విషయం అడుగుతుంటే యజమాని అదేమీ పట్టించుకోకుండా మరేదో ముఖ్య ఆలోచనలో నిమగ్నుడై ఉన్నంత వైభవంగా ఉంది.

సుబ్హానల్లాహ్! నమాజ్ చేసే వ్యక్తికి సమాధిలో ఇంత ప్రశాంతత, ఇంత హుందాతనం, ఇంత నిర్భయం కేవలం నమాజ్ వల్లనే లభిస్తుంది. ప్రపంచంలో అతను ఆ నమాజును ఎంత ఖచ్చితంగా నెరవేరుస్తూ ఉంటాడంటే సమాధిలో సూర్యుడు అస్తమించినట్లు కనబడగానే అతను భయాందోళనలన్నిటిని మరిచిపోయి నమాజు ఆలోచనలో పడిపోతాడు. దైవదూతలు ఎంత బతిమాలినా వారిని పట్టించుకోడు. తర్వాత తను ఉన్నది పితృలోకంలోననీ, ఇక్కడ నమాజు చేయవలసిన అవసరం లేదనీ తాను స్వయంగా గ్రహించినప్పుడు తిరిగి దైవదూతలవైపు దృష్టి సారించి ప్రశాంతంగా వారి ప్రశ్నలకు సమాధానాలు ఇస్తాడు.

---

* ముస్తద్రక్ హాకిమ్ 1/1443

https://teluguislam.net



ఇంతకు ముందు సమాధి ఉపద్రవం నుంచి కాపాడే ఆచరణల్లో మీరు నమాజు కూడా సమాధిలో మనిషిని కాపాడే ఆచరణల కోవకు చెందినదేనని చదివారు. ప్రళయానికి ముందే నమాజు తనను పాటించేవారి కొరకు ఎంతటి కారుణ్య ప్రదమైనదో, అది వారి ప్రాణాలకు ఎంతటి హాయినిస్తుందో దీని ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రళయదినాన దేవుని హక్కుల్లో అన్నిటికంటే ముందు నమాజు గురించే లెక్క తీసుకోబడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. (తిర్మిజీ)

## హువల్ అజీజుల్ జబ్బారుల్ ముతకబ్బిర్!

దైవగ్రంథం, దైవప్రవక్త విధానం విషయంలో అజ్ఞానం వల్ల మననాట నిజమైన విశ్వాసాలు ఎంతగా బలహీనమైపోయాయంటే కుడివైపు, ఎడమవైపు వెనకాముందు ఎటు చూసినా బహుదైవారాధనే కనిపిస్తోంది. మహాత్ములు, వలీల పేర్లతో ప్రజలు ఎలాంటి నమ్మకాలు, కట్టుకథలు సృష్టించుకున్నారంటే యావత్తు విశ్వంలో దేవుని ఏకత్వానికి, దైవప్రవక్తల దౌత్యానికి అసలు ఆస్కారమే ఉన్నట్లు కనిపించదు. దైవం రక్షించుగాక!

ఈ స్వయంకల్పిత విశ్వాసాలను పరిశీలిస్తే బోధపడేదేమిటంటే మహాత్ముల వలీల పనితనం, కష్టాలను తొలగించే, అవసరాలను తీర్చే వారి ఈ పరంపర ఈ ప్రపంచం వరకే పరిమితం కాదు. పైగా పితృలోకంలో, పరలోకంలోనూ ఇది కొనసాగుతూ ఉంటుంది. ఆ మహానుభావులకు పితృలోకంలోనూ అధికారం ఉంటుందనే మూఢ విశ్వాసానికి కొన్ని ఉదాహరణలు చూడండి.

1) ఒకసారి ఓ రాజు "నా కూతురు జబ్బుపడింది. మీ మహిమ వల్లనయినా ఆ జబ్బు నయమవుతుందేమో. కాస్త మీరొచ్చి పరామర్శించి వెళ్ళండి" అని ముహ్యిుద్దీన్ ఇబ్నె అరబీ గారికి కబురు పంపించాడు. ముహ్యుద్దీన్ ఇబ్నె అరబీ గారు వచ్చి" (సమయం మించిపోయింది) ఇజ్రాయీల్ దూత మీ అమ్మాయి ప్రాణం తీయటానికి వచ్చేశాడు" అని అన్నారు. ఆ మాట వినగానే రాజు ఆయన కాళ్లమీద పడి "నా కూతుర్ని మీరే కాపాడాలి" అని వేడుకున్నాడు. అప్పుడు ఇబ్నె అరబీ ఇజ్రాయీల్ దూతతో "ఆగు! ఆ అమ్మాయి ప్రాణాలు తీయకు. కావాలంటే నా కూతురిని తీసుకొని వెళ్ళు" అని అన్నారు. ఇంటికి వెళ్ళి గుమ్మం వైపు తిరిగి "ఇజ్రాయీల్! ఈ అమ్మాయిని తీసుకువెళ్ళు" అన్నారు. క్షణాల్లో ఆ అమ్మాయి నేలకొరిగి మరణించింది. మరోవైపు రాజుకూతురికి నయమయి పోయింది. *

---

★ ముర్షిదె కామిల్. సాదిఖ్ ఫర్ఖానీ గారి హదాయిఖుల్ అఖ్బార్ అనువాద గ్రంథం 23వ పుట

https://teluguislam.net



పై సంఘటన ద్వారా ఈ క్రింది విషయాలు బోధపడుతున్నాయి:

1) ఇజ్రాయీల్ దూత అల్లాహ్ ఆజ్ఞల్ని కాదు, ఔలియాల ఆజ్ఞల్ని పాటిస్తారు. 2) జీవన్మరణాల మీద ఔలియాలకు పూర్తి అధికారాలు ఉన్నాయి (3) ఔలియాలకు అల్లాహ్ నిర్ణయాలను మార్చేందుకు తిరుగులేని శక్తి ఉంది.

2) రెండో సంఘటన-ఖాజా ముయీనుద్దీన్ చిష్తీగారి అనుచరుల్లో ఎవరో చనిపోతే ఆయన కూడా అతని జనాజా వెంట వెళ్ళారు. ఖననం జరిగిన తర్వాత జనం ఎవరి ఇండ్లకు వాళ్లు వెళ్ళిపోయారు. కాని ఖాజాగారు మాత్రం అక్కడే ఉండిపోయారు. షేఖుల్ ఇస్లామ్ ఖుత్బుద్దీన్ ఇలా అంటున్నారు: ఆ సమయంలో నేను ఆయన దగ్గరే ఉన్నాను. క్షణక్షణం ఆయన మొహంలో రంగులు మారుతూ ఉన్నాయి. కాసేపటికి మామూలు స్థితికి వచ్చారు. అప్పుడు ఇంటికి తిరిగి వెళ్ళటానికి పైకి లేస్తూ "అల్ హమ్దు లిల్లాహ్! బైత్ చేయటం చాలా మంచిది" అన్నారు. షేఖుల్ ఇస్లామ్ ఖతీబుద్దీన్ గారు ఆయన్ని అలా అనటానికి కారణమేమిటని అడిగారు. అప్పుడాయన ఇలా చెప్పారు: ప్రజలు ఈ వ్యక్తిని ఖననం చేసి వెళ్ళిపోయిన తర్వాత నేను చూశాను. శిక్షించే దూతలు ఇతన్ని శిక్షించటానికి వచ్చారు. అప్పుడే షేఖ్ ఉస్మాన్ హారూనీ (ఖాజాగారి గతించిన పీరు) ప్రత్యక్షమయి "ఇతను నా అనుచరుడు" అని చెప్పి అడ్డుకున్నారు. అంతలో దూతలకు 'ఇతను మీరు చూపిన విధానానికి విరుద్ధంగా జీవితం గడిపాడని ఆయనతో చెప్పండి' అని ఆజ్ఞ అయింది. అందుకు షేఖ్‌గారు "ఏమయినా కానివ్వండి, ఇతను ఈ ఫకీరు ఆశ్రమాన్ని అంటిపెట్టుకొని ఉన్నాడు. ఇతన్ని శిక్షిస్తే నేను ఊరుకోను" అన్నారు. అప్పుడు దూతలకు ఆజ్ఞ అయింది. "దూతలారా! షేఖ్‌గారి అనుచరుణ్ణి వదలిపెట్టండి. నేనతన్ని క్షమించాను" అని.[1]

పై కథ ద్వారా ఈ క్రింది విషయాలు బోధపడతాయి.

1) శిక్ష విధించే లేక రద్దు చేసే అధికారం ఔలియాలకు కూడా ఉంది. 2) ఔలియాలకు పాపాలు క్షమించే అర్హత కూడా ఉంది. 3) ఔలియాల చేతిపై ఒకసారి ప్రమాణం చేసుకుంటే జీవితపు పాపాలన్నీ క్షమించబడతాయి.

3) మూడో సంఘటన-గౌసెపాక్ (అనగా అబ్దుల్ ఖాదిర్ జీలాని) గారి కాలంలో ఒక మహాపాపాత్ముడు ఉండేవాడు. అయితే అతనికి గౌసెపాక్ మీద చాలా అభిమానం ఉండేది. అతను చనిపోయిన తర్వాత సమాధిలో మున్కిర్ నకీర్ దూతలు వచ్చి అతన్ని ప్రశ్నలు అడిగారు. అతను మాత్రం ప్రతి ప్రశ్నకు "అబ్దుల్‌ఖాదిర్" అనే జవాబు చెప్పసాగాడు. అప్పుడు అల్లాహ్ తరపునుంచి "ఈ దాసుడు ఫాసిఖ్ (పాపాత్ముడు)

---

1 రాహతుల్ ఖులూబ్, మల్‌ఫూజాత్ ఖాజా ఫరీదుద్దీన్ షకర్‌గంజ్ అజ్ నిజాముద్దీన్ ఔలియా 132వ పుట.

https://teluguislam.net



అయినప్పటికీ ఇతనికి అబ్దుల్ ఖాదిర్ పట్ల చాలా అభిమానం ఉంది. అందుకని నేను ఇతన్ని క్షమించేశాను" అని తెలియజేయబడింది.[1]

పై కథ ద్వారా సూటిగా బోధపడుతున్నదేమిటంటే ఔలియాలను అభిమానించేవాడు పాపాత్ముడైనా క్షమించబడతాడు. ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోండి. విద్యావేత్తల అభిప్రాయం ప్రకారం ఫాసిఖ్ అంటే ఘోరపాపాలకు పాల్పడినవాడు. ఉదా: నమాజు ఎగ్గొట్టేవాడు. వ్యభిచారం చేసేవాడు. తాగుబోతు మొదలగువారు.

4) షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలాని (రహ్మాలై) అశాశ్వతమైన ఇహలోకాన్ని వీడి శాశ్వతమైన పరలోకానికి వెళ్లినప్పుడు ఒక మహాత్ముని కలలోకి వచ్చి ఇలా చెప్పారు: మున్కిర్ నకీర్ దూతలు నా దగ్గరికి వచ్చి "మన్ రబ్బుక" (నీ ప్రభువు ఎవరు)?" అని అడిగారు. అందుకు నేను వారితో "ఇస్లామీయ విధానం ప్రకారం ముందు సలాం చేసి కరచాలనం చేయాలి" అని అన్నాను. వారు గతుక్కుమని సలాంచేసి నాతో కరచాలనం చేశారు. అప్పుడు నేను వారిద్దరి చేతులు గట్టిగా పట్టుకొని "ఆదంను పుట్టించినప్పుడు మీరు దేవునితో "భూమిలో కల్లోలాన్ని వ్యాపింపజేసేవాణ్ణి పుట్టిస్తావా?" అని చెప్పి దైవజ్ఞానానికంటే మించిపోవటానికి ఎందుకు ప్రయత్నించారు, మీరు? అంతేకాదు, మానవజాతిమీద కల్లోలం, రక్తపాతాల అభియోగం ఎందుకు మోపారు? నా ఈ ప్రశ్నలకు సమాధానం ఇస్తేగాని నేను మిమ్మల్ని వదలిపెట్టను" అని అన్నాను.

మున్కిర్ నకీర్ దూతలు నోరెల్లబెట్టి ఒకరిమొహాలు ఒకరు చూసుకున్నారు. ఆయన్నుంచి విడిపించుకోవాలని ప్రయత్నించారు. కాని ఆ వీరుడు, ఒంటరి పోరాటయోధుని ముందు దైవదూతల శక్తి ఏపాటిది? గత్యంతరం లేక వారు "ప్రభూ! ఆ మాట మేమే కాదు దూతలందరూ అన్నారు. మమ్మల్ని విడిచిపెట్టండి. మేమెళ్ళి వాళ్ళను అడిగి మీకు సమాధానం చెబుతాం" అని ప్రాధేయపడ్డారు. అప్పుడు గౌస్‌గారు ఒక దూతను వదలి మరోదూతనుపట్టి ఉంచారు. ఆ దూతపైకెళ్ళి మిగతా దూతలందరికి ఆ విషయం తెలియజేశాడు. కాని వారిలో ఏ ఒక్కరూ ఆయన ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయారు. అప్పుడు అల్లాహ్ తరపునుంచి "మీరంతా నాప్రియుని దగ్గరికి వెళ్ళి మీ తప్పుని మన్నించమని వేడుకోండి. ఆయన మన్నించనంతవరకూ మీకు ముక్తి లభించదు" అని దూతలకు ఆదేశమయింది. దాంతో దైవదూతలందరూ మహ్‌బూబ్ సుబ్‌హానీ దగ్గరికి వెళ్ళి మన్నించమని ప్రాధేయపడ్డారు. అల్లాహ్ కూడా వారి గురించి సిఫారసు చేశాడు. అప్పుడు గౌసె అజమ్ గారు "ఓ సృష్టికర్తా! ఓ గొప్ప ప్రభువా! నీ కరుణా కటాక్షాలతో నా అనుచరులందరినీ క్షమించు. వారికి మున్కిర్ నకీర్ ప్రశ్నల అవస్థ లేకుండా చెయ్యి. అలాచేస్తేనేగాని నేను నీ దూతల్ని మన్నించను" అని డిమాండు

1) సీరతెగౌస్ 214వ పుట

https://teluguislam.net



చేశారు. అప్పుడు దేవుడు "ప్రియతమా! నేను నీ డిమాండును అమోదిస్తాను. నువ్వు నా దూతల్ని మన్నించు" అని అడిగాడు. గౌస్‌గారు దూతల్ని మన్నించగా వారందరూ తమలోకాలకు వెళ్ళిపోయారు.1

పైన పేర్కొనబడిన కథ ద్వారా ఈ క్రింది విషయాలు బోధపడుతున్నాయి:

1) దైవదూతలు ఔలియాలకు సమాధాన పడవలసి ఉంటుంది. 2) ఔలియాల ముందు దైవదూతలు కూడా నిస్సహాయులే 3) ఔలియాల ముందు అల్లాహ్‌కు కూడా సిఫారసు చేయవలసిన దుస్థితి ఎదురవుతుంది. 4) అబ్దుల్ ఖాదిర్ జీలానీ సంబంధీకులందరూ సమాధి ఉపద్రవం నుంచి సురక్షితంగా ఉంటారు.

ఔలియాలు, సూఫీల కథల తర్వాత ఇప్పుడు దైవప్రవక్త కాలంలోనే చనిపోయిన ఇద్దరు గొప్ప మహామహులైన దైవప్రవక్త అనుచరుల సంఘటనలు కూడా చదవండి (చదివి ఏది నిజమో గ్రహించండి!)

1) ఔస్ తెగ సర్దారు సాద్ బిన్ ముఆజ్ (రజి) చనిపోయినప్పుడు దైవప్రవక్త (సల్లం) అక్కడికి వచ్చారు. సాద్ తలను తన తొడమీద పెట్టుకొని "ఓ అల్లాహ్! సాద్ నీ మార్గంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాడు. నీ ప్రవక్తను బలపరిచాడు. ఇస్లాం ధర్మ హక్కుల్ని నెరవేర్చాడు. అల్లాహ్! నీవు నీ మిత్రుల పట్ల ఎలా వ్యవహరిస్తావో ఇతని ఆత్మపట్ల కూడా అలాగే వ్యవహరించు" అని ప్రార్థించారు. సాద్ మరణించినప్పుడు ఆయన "సాద్ మరణంతో కరుణామయుని సింహాసనం కదిలింది" అని అన్నారు (బుఖారీ-ముస్లిం). సాద్‌గారి శవపేటిక ఎత్తినప్పుడు అది చాలా తేలికగా అనిపించింది. అప్పుడు దైవప్రవక్త "సాద్ జనాజాను దైవదూతలు ఎత్తుకున్నారు" అని చెప్పారు. దైవప్రవక్త స్వయంగా ఆయన జనాజా నమాజ్ చేశారు. తన కోసం ప్రాణాలు సయితం అర్పించటానికి సిద్ధంగా ఉండే తన అనుచరుల మన్నింపుకోసం ప్రార్థించారు. జనాజా నమాజ్ తర్వాత దైవప్రవక్త (సల్లం) "సాద్ జనాజాలో డెబ్బైవేల దూతలు పాల్గొన్నారు" అని చెప్పారు. సాద్ ఆత్మకోసం ఆకాశపు ద్వారాలన్నీ తెరువబడ్డాయి. ఆయన ఆత్మ ఏ ద్వారం గుండానయినా లోనికి వెళ్ళవచ్చు" అని కూడా ఆయన చెప్పారు.

జన్నతుల్ బఖీ (మదీనాలోని శ్మశానం)లో ఆయన ఖననం చేయబడ్డారు. ఆయన కోసం సమాధిని తవ్వింది హజ్రత్ అబూసయీద్ ఖుద్రి (రజి). సమాధి త్రవ్వుతున్నప్పుడు ఆయన "దైవం సాక్షి! నాకు ఈ సమాధిలో నుంచి కస్తూరి సువాసన వస్తుంది" అని అన్నారు. దైవప్రవక్త స్వయంగా తన చేతులతో శవాన్ని సమాధిలో ఉంచారు. సమాధిని మట్టితో పూడ్చిన తర్వాత ఆయన చాలా సేపటి వరకు "సుబ్‌హానల్లాహ్! సుబ్‌హా

1) హజ్రత్ రియాజ్ అహ్మద్ గోహర్‌షాహి. ముఖ్ తసరుల్ మజాలిస్ 8-10పుటలు

https://teluguislam.net



నల్లాహ్!" అని అంటూ ఉన్నారు. అది చూసి ఆయన అనుచరులు కూడా అలాగే అనటం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఆయన "అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్" అని పలకసాగారు. అయన్ని చూసి ఆయన అనుచరులు కూడా అవే పలుకులు ఉచ్చరించటం మొదలుపెట్టారు. ప్రార్థన అయిపోయిన తర్వాత అనుచరులు "దైవప్రవక్తా! ఇందాక మీరు తస్బీహ్, తక్బీర్‌లు ఎందుకు పఠించారు?" అని అడిగారు. అందుకాయన ఏమాన్నరంటే "ఖననం తర్వాత సమాధి సాద్‌ను ఒత్తడం మొదలుపెట్టింది. నేను అల్లాహ్‌ను ప్రార్థించగా అల్లాహ్ ఆయన సమాధిని విశాలపరిచాడు"అని చెప్పారు. వేరొక సందర్భంగా ఆయన (సల్లం) "సమాధి పీడనం నుంచి ఎవరైనా బయటపడగలిగితే సాద్ బిన్ ముఆజ్ మాత్రమే బయటపడగల్గుతారు" అని కూడా చెప్పి ఉన్నారు. *

హజ్రత్ సాద్ మరణ సంఘటన నుంచి మనం ఈ క్రింది విషయాలు తెలుసుకోవచ్చు.

1) పాపాలను క్షమించే అధికారం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. అలాగే దైవప్రవక్త (సల్లం) సాద్ (రజి) గారి విశ్వాసాన్ని మాత్రమే ధృవీకరించారు. తర్వాత ఆయన మన్నింపు కోసం దైవాన్ని ప్రార్థించారు.

2) సాద్‌గారి జనాజా నమాజు దైవప్రవక్త స్వయంగా చేయించారు. ఆయనగారి జనాజా నమాజులో డెబ్భైవేలమంది దైవదూతలు పాల్గొన్నారు. ఆయన ఆత్మ కోసం ఆకాశపు ద్వారాలన్నీ తెరువబడ్డాయి. ఆయన శవాన్ని దైవప్రవక్త స్వయంగా తన చేతులతో సమాధిలోకి దించారు. అయినప్పటికీ సమాధి సాద్‌ను ఒత్తకుండా వదల్లేదు. దీని ద్వారా తెలిసేదేమిటంటే అల్లాహ్ తన దాసులందరి వ్యవహారాలమీద అధికారం ఉన్నవాడు. అందుకే ఆయన విధించబోయిన శిక్షను ప్రవక్తగాని డెబ్భైవేల దూతలుగాని ఎవరూ ఆపలేకపోయారు.

3) సాద్‌ను సమాధి ఒత్తుతుండటం చూసి దైవప్రవక్త (సల్లం) కంగారుపడి అల్లాహ్‌ను స్తుతించటం, ఆయన పవిత్రతను కొనియాడటం, ఆయన గొప్పదనాన్ని కీర్తించటం మొదలుపెట్టారు. సాద్‌కు సమాధియాతన తప్పేవరకూ అలాగే చేస్తూ ఉన్నారు. దీని ద్వారా తెలిసేదేమంటే దైవానికి నమ్రతా అణకువ భావాలతో విన్నపాలు, వినతులయితే చేసుకోవచ్చుగాని బలవంతంగా తనమాటను ఒప్పించటం దైవ ప్రవక్తకు కూడా సాధ్యం కాదు.

2- రెండో సంఘటన హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్‌ది. ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ (రజి) మక్కా నుంచి మదీనాకు వలసవెళ్ళిన తర్వాత అప్పుడు జరిగిన (సోదర సంబంధాల) ప్రకారం ఉమ్ముల్ ఉలా అన్సారియా (రజిఅన్‌హా) ఇంట్లో ఉండేవారు.

---

* వివరాల కోసం చూడండి ముస్తద్రక్ హాకిమ్ (4/4981-4983)

https://teluguislam.net



ఆయన మరణించినప్పుడు ఉమ్ముల్ ఉలా (రజి. అన్హా) దైవప్రవక్త సమక్షంలోనే ఇలా అన్నారు: ఓ అబూ సాయిబ్! (ఇది ఉస్మాన్‌కు మారుపేరు) నీమీద దేవుని కారుణ్యం అవతరించుగాక! (మరణానంతరం) అల్లాహ్ నీకు గౌరవాన్ని ప్రసాదించాడని నేను సాక్ష్యం చెప్పగలను" ఆ మాట విన్న దైవప్రవక్త 'అతనికి గౌరవం లభించిందని నీకెలా తెలుసు' అని అడిగారు. అందుకు సమాధానమిస్తూ ఉమ్ముల్ ఉలా (రజి. అన్హా) "దైవప్రవక్తా! నా తల్లిదండ్రుల్ని మీ కోసం అర్పింతును. అల్లాహ్ ఈయనకు గౌరవం ప్రసాదించకపోతే ఇంకెవరికి ప్రసాదిస్తాడు" అని అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) ఏం చెప్పారో చూడండి. "ఉస్మాన్‌కు మరణం వచ్చింది. దైవసాక్షి! నేను ఆయనకు మంచే జరగాలని కోరుకుంటున్నాను. (కాని ఒకరి గురించి ముందే అలా ఖచ్చితంగా చెప్పలేము, నా విషయమే తీసుకోండి) నేనొక దైవప్రవక్తను. కాని దైవం తోడు! (ప్రళయదినాన) నా పరిస్థితి ఎలా ఉంటుందో నాకే తెలియదు."

ఈ సందర్భంగా మీరు కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలి. హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ (రజి)కు రెండుసార్లు ఇథియోపియాకు, మూడోసారి మదీనాకు హిజ్రత్ చేసే సౌభాగ్యం లభించింది. ఈయన చనిపోయినప్పుడు దైవప్రవక్త ఈయన నుదుటిని మూడుసార్లు ముద్దాడారు. "ఉస్మాన్! నువ్వు ఈ ప్రపంచంతో ఏ మాత్రం కలుషితం కాకుండా ఇక్కణ్ణుంచి వెళ్ళిపోయావు" అని అన్నారు.

ఉస్మాన్ బిన్ మజ్‌వూన్ (రజి) సంఘటన నుంచి మనకు ఈ క్రింది విషయాలు బోధపడతాయి.

1) దేవుని దగ్గర ఎవరికి ఎలాంటి స్థానముందో ఎవరికీ తెలియదు.

2) పాపాలను మన్నించే లేక మన్నించకుండా ఉండే అధికారం అల్లాహ్‌కు మాత్రమే ఉంది.

3) దేవుని ఔన్నత్యం, గొప్పదనం ముందు దైవప్రవక్త (సల్లం) కూడా నిస్సహాయులే.

పాఠక మహాశయులారా!

ఇస్లాం ధర్మం దైవగ్రంథం, దైవప్రవక్త విధానం మీద ఆధారపడి ఉందని మీ అందరికీ తెలుసు. ఆ రెండూ మనకు బోధిస్తున్నదేమిటంటే-అల్లాహ్‌కు తన దాసులందరిమీద అధికారం ఉంది. ఒకరి పాపాలను క్షమించటం క్షమించకపోవటం అనే అధికారం కేవలం ఆయనకు మాత్రమే ఉంది. ఆయన తాను తలచుకున్నది చేస్తాడు. ప్రవక్తలు, దూతలందరూ కలిసి కూడా ఆయన ఆజ్ఞల్ని మార్చలేరు. తప్పించనూ లేరు. ఆయనకు తన నిర్ణయాలన్నిటినీ అమలు పరిచే శక్తి ఉంది. ఈ విశ్వంలో 'అజీజు' (సర్వాధిక్యుడు)

https://teluguislam.net



ఆయన మాత్రమే. ఆయన మాత్రమే జబ్బారు (బలవంతంగా తన ఆజ్ఞల్ని అమలుపరిచేవాడు). ఆయనే ముతకబ్బిర్ (తన సృష్టిముందు గొప్పవాడై ఉండేవాడు). ఏ ప్రవక్త లేక వలీ ముందయినా ఆయనకు సిఫారసుకర్తగా నిలబడవలసి వస్తుందనే భావనకు ఆయన చాలా అతీతుడు.

దైవప్రవక్త కాలానికి సంబంధించిన పై సంఘటనల ద్వారా మనకు ఆ విషయాలే బోధపడుతున్నాయి. మహాత్ములు, ఔలియాల పేరుతో చెప్పబడే కట్టుకథలు ఖుర్‌ఆన్ హదీసుల బోధనలకు, దైవప్రవక్త కాలంలోని సంఘటనలకు విరుద్ధంగా ఉన్నాయి. నిజానికి బుజ్‌రుగ్‌లు, వలీల గురించి ఇలాంటి కథలు చెప్పటం అల్లాహ్ పట్ల ఎంతటి అపచారమంటే ఆ పాపానికి భూమి బ్రద్దలయినా లేక ఆకాశం విరిగి పడినా ఆశ్చర్యం లేదు. ముష్రిక్కులు కల్పించే బహుదైవత్వ భావనలకు అల్లాహ్ ఎంతో అతీతుడని మేము సాక్ష్యం చెబుతున్నాం. సుబ్‌హాన రబ్బిక రబ్బిల్ ఇజ్జతి అమ్మా యసిఫూన్.

سُبْحَانَ رَبِّكَ رَبِّ الْعِزَّتِ عَمَّا يَصِفُوْنَ.

## ఒక అపోహ!

ముస్లింలలోని ఒక వర్గం సమాధిలో శిక్షగాని లేక బహుమానంగాని ఉంటుందనే విశ్వాసాన్ని త్రోసిపుచ్చుతోంది. అందుకు ఆ వర్గం వారు చూపించే ఆధారాలు, నిదర్శనాల్లో ఒకటి ఏమిటంటే "శిక్షలు, బహుమానాలు అనేవి ప్రళయదినానికి సంబంధించినవి. అంతకుముందు శిక్షించటం లేక బహుమానం ఇవ్వటం న్యాయానికి విరుద్ధం. కనుక సమాధిలో శిక్షలుగాని బహుమానాలుగాని ఏవీ ఉండవు".

ఈ అపోహకు కారణమేమిటంటే సమాధి జీవితం ప్రస్తుతం మనం గడుపుతున్న జీవితం కంటే వేరుగా ఉంటుంది. అది పరలోక జీవితానికి కూడా భిన్నంగా ఉంటుంది. కనుక సమాధి జీవితంలోని పరిస్థితుల స్వరూపస్వభావాలను అర్థం చేసుకోవటం బ్రతికున్న మనకు అసాధ్యం. దీనిగురించి మేము తొలిపలుకుల తర్వాత అనుబంధంలో "సమాధి జీవితం ఎలా ఉంటుంది!" అనే శీర్షికన చాలా విస్తృతంగా చర్చించాం. అది చదివితే ఇన్షాఅల్లాహ్ ఇలాంటి అనేక అపోహలు దూరమవుతాయి.

పైన పేర్కొనబడిన అపోహకు రెండోకారణం, సమాధిలో లభించే శిక్ష లేక బహుమానం యొక్క స్వభావం సరిగ్గా, స్పష్టంగా తెలియకపోవటం. ఇక్కడ మేము సమాధి జీవితంలో లభించే శిక్ష లేక బహుమానపు స్వభావం సరిగ్గా ఎలా ఉంటుంది అనే విషయాన్ని ఒక ఉదాహరణ ద్వారా స్పష్టం చేయటానికి ప్రయత్నిస్తాం.

పోలీసు ఉన్నతాధికారులు ఎవరైనా వ్యక్తి గురించి "ఫలానా అతను నేరాలను వృత్తిగా చేసుకొని బతుకుతున్నాడు. దానికి సంబంధించిన సాక్ష్యాధారాలన్నీ మాదగ్గర ఉన్నాయి.

https://teluguislam.net



అతన్ని అరెస్టు చేయండి" అని తమ క్రింద పనిచేసే పోలీసుల్ని ఆదేశించారనుకోండి. అప్పుడు పోలీసులు అతన్ని అరెస్టు చేస్తారు. చట్టప్రకారం కోర్టు నుంచి తీర్పు వెలువడనంతవరకూ అతన్ని ఏవిధంగానయినా శిక్షించే అధికారం పోలీసులకు లేకపోయినప్పటికీ అతన్ని తమ కస్టడీలో ఉంచిన పోలీసువర్కర్లకు అతని నేరప్రవృత్తి గురించి తెలిసి ఉంటుంది. కనుక వారు అతన్ని విపరీతంగా అసహ్యించుకుంటారు, గదుముతూ ఉంటారు. "కోర్టు నుంచి తీర్పు రానీ, అప్పుడు నీ అంతు తేలుస్తాం" అని బెదిరిస్తారు, భయపెడ్తారు. పోలీసు కస్టడీలో ఉన్నప్పుడు నిజానికి అతనిపట్ల చాలా నీచంగా, అవమానకరంగా ప్రవర్తించటం జరుగుతుంది. అతన్ని కుర్చీమీద కూర్చోనివ్వరు. మంచం మీద పడుకోవటానికీ అనుమతించరు. అతని దగ్గరినుంచి వెళ్ళే ప్రతిపోలీసు అతని ప్రాణం తీస్తాడా అన్నట్లు అతని వంక కోపంగా చూస్తూ వెళ్తాడు.

తెలుస్తూనే ఉంది. ఇలాంటి మనిషి తన కేసు కోర్టుకు వెళ్ళాలనిగాని, అక్కడ చట్టప్రకారం తీర్పు జరగాలని గాని ఎన్నటికీ కోరుకోడు. కాని ఎప్పుడయితే కోర్టులో అతని కేసుకు సంబంధించి విచారణ జరిగి తీర్పు వెలువడుతుందో, ఆ తీర్పు ప్రకారం అతని అసలు శిక్ష-కొరడా దెబ్బలు, ఇతర బాధలు లేక జరిమానా మొదలగునవి మొదలవుతాయి. కారాగార శిక్షకు ముందు పోలీసుకస్టడీలో ఉన్నప్పుడు నిందితునికి కలిగే మానసిక హింస కారాగారంలో లభించే శారీరకశిక్ష కంటే వేరయినప్పటికి అది కూడా ఒక శిక్షే కదా! సమాధి శిక్ష కూడా పోలీసు కస్టడీలో నిర్బంధించబడిన నిందితునికి కలిగే మానసిక హింస లాంటిదే.న్యాయస్థానంలో ఆ నిందితుని కేసు విచారణ జరగటం, దాని ప్రకారం శిక్షపడటం ఇంకా మిగిలి ఉంది. అదిమటుకు ప్రళయదినానే జరుగుతుంది. కాని ప్రళయంకంటే ముందు అవిశ్వాసికి అతని పర్యవసానం తెలియజేయటం, అతన్ని అవమానించటం పరాభవించటం, అతనికి అతని పరలోకస్థానం చూపించటం కూడా ఒక రకంగా శిక్షే. అఫ్‌కోర్స్ అది నరక శిక్షకు భిన్నంగా ఉండవచ్చు.

అలాగే సమాధిలో విశ్వాసికి, దైవభక్తిపరునికి లభించే శిక్ష లేక బహుమానపు ఉదాహరణ ఈ వ్యక్తిని పోలి ఉంటుంది. పోలీసులు అతన్ని ఉన్నతాధికారుల ఆదేశం మేరకు అరెస్టు అయితే చేశారు కాని, అరెస్టుకాబడిన వ్యక్తి నిర్దోషి అనీ, చట్టబద్ధుడు, మంచి పౌరుడనీ కనుక అతని పట్ల గౌరవంగా, మర్యాదగా వ్యవహరించమని కూడా ఉన్నతాధికారులు వారికి పురమాయించి ఉంటారు. అలాంటప్పుడు న్యాయస్థానం నుంచి తీర్పు వెలువడక ముందు పోలీసులు అతన్ని విడుదల చేయలేకపోయినా అతని మంచితనం, మర్యాదల మూలంగా పోలీసులందరూ అతన్ని గౌరవదృష్టితో చూస్తారు. అతని అవసరాలన్నీ తీరుస్తారు. పైగా "మీరేమీ చింతించకండి. మీరు నిర్దోషులు.

https://teluguislam.net



మీరు తప్పకుండా న్యాయస్థానంలో గౌరవంగా నిర్దోషి అయినట్లు ప్రకటించబడతారు' అని అతనికి ధైర్యం చెబుతారు. ఇలాంటి వ్యక్తి తన కేసు త్వరగా న్యాయస్థానంలో ప్రవేశపెట్టబడాలనీ, వీలైనంత త్వరగా తను సుఖశాంతులతో కూడిన జీవితం గడపాలని విపరీతంగా కోరుకుంటాడు. న్యాయస్థానంలో కేసు విచారణకు వచ్చి న్యాయస్థానం గౌరవంగా అతన్ని నిర్దోషిగా ప్రకటించినప్పుడు పోలీసులు పూర్తి గౌరవమర్యాదలతో అతన్ని సుఖదాయకమైన శాంతిపూర్వకమైన అతని ఇంటికి చేరుస్తారు. రిమాండులో ఉన్నప్పుడు అతనికి లభించిన గౌరవం, సుఖం తన ఇంటికి చేరుకున్న తర్వాత లభించే గౌరవం, సుఖం లాంటిది కాకపోవచ్చు. అయినప్పటికీ అది కూడా అతని మంచితనానికి లభించిన బహుమానం, గౌరవమే కదా! సమాధిలో విశ్వాసికి లభించే గౌరవసత్కారాల సంగతి కూడా పూర్తిగా అంతే! స్వర్గంలో ఇంటి శుభవార్త అతనికి వినిపించబడుతుంది. ఇతర అనుగ్రహాలు చూపించబడతాయి. అన్ని విధాల సుఖశాంతులు కల్పించబడతాయి. అయితే విశ్వాసి ఆ అనుగ్రహాలను, సుఖాలను క్రియాత్మకంగా అనుభవించటం అనేది తను దేవుని న్యాయస్థానంలో నిర్దోషిగా ప్రకటించబడి పూర్తి గౌరవమర్యాదలతో స్వర్గంలోకి ప్రవేశించే రోజు మాత్రమే జరుగుతుంది. వల్లాహు ఆలము బిస్సవాబ్!

## సమాధి గుణపాఠం నేర్చుకునే స్థలమా లేక జాతర స్థలమా?!

మేము ఇంతకు ముందు రాసినట్లు సమాధి నిశ్చయంగా గొప్ప భయాందోళనకరమైన ప్రదేశం. దైవప్రవక్త (సల్లం) స్వయంగా ఆ మాట చెప్పారు. "నేను సమాధికంటే భయాందోళనకరమైన ప్రదేశమేదీ చూడలేదు" (తిర్మిజీ). ఒకరి అంత్యక్రియల్లో దైవప్రవక్త (సల్లం) సమాధికి తలవైపున కూర్చొని ఉన్నారు. ఆ సమయంలో ఆయన సమాధి పీడనాన్ని గుర్తుకు తెచ్చుకుని ఎంతగా విలపించారంటే ఆయన కన్నీటితో సమాధి మట్టి తడిచిపోయింది. ఆయన ఇంకా ఇలా అన్నారు. "నా సోదరులారా! దీని కోసం ఏమైనా సన్నాహాలు చేసుకోండి" (తిర్మిజీ). ఆయన స్వయంగా సమాధి శిక్షనుంచి శరణు కోరుకోమని హితోపదేశం చేశారు. ఆయన అవలంబించిన విధానం ఫలితంగా సమాధి ప్రస్తావన రాగానే ఆయన అనుచరులు కన్నీరు మున్నీరుగా విలపించేవారు, దుఃఖ పడేవారు.

హజ్రత్ సల్మాన్ ఫార్సీ (రజి) ఇలా అంటున్నారు: మూడు విషయాలు నన్ను దుఃఖానికి గురిచేస్తాయి. వాటిమూలంగా నేను కన్నీరుమున్నీరుగా విలపిస్తాను. మొదటిది. దైవప్రవక్త యెడబాటు దుఃఖం. రెండోది, సమాధి శిక్ష. మూడోది, ప్రళయభయం. హజ్రత్ మాలిక్ బిన్ దీనార్ (రహ్మలై) చావుని, సమాధిని గుర్తుచేసుకొని సొమ్మసిల్లిపోయేలా ఏడ్చేవారు.

దైవప్రవక్త (సల్లం) కేవలం ప్రజలకు పరలోకం గుర్తుకురావాలన్న ఉద్దేశ్యంతోనే తన అనుచర సమాజానికి సమాధుల్ని సందర్శించేందుకు అనుమతినిచ్చారు (తిర్మిజీ).

https://teluguislam.net



ముస్నదె అహ్మద్‌లోని వాక్యాలు ఇలా ఉన్నాయి: "సమాధుల్ని సందర్శించండి. ఎందుకంటే సమాధుల సందర్శనం గుణపాఠం నేర్పుతుంది". అంటే ఆ సమయంలో మనిషి ప్రపంచాన్ని మర్చిపోయి పరలోకంవైపు దృష్టిసారిస్తాడు. ప్రపంచం అశాశ్వతం అన్న విషయం గురించి ఆలోచించటానికి అవకాశం లభిస్తుంది. ఇతరుల సమాధులు చూసి తన సమాధి గుర్తొస్తుంది. తాత్కాలికమైన ప్రాపంచిక ప్రయోజనాల కోసం దేవునికి, ఆయన ప్రవక్తకు అవిధేయత చూపుతున్నందుకు బాధ, పశ్చాత్తాపాలు కలుగుతాయి. తను చేసిన పాపాలకు పశ్చాత్తాపపడి మన్నింపుని వేడుకుందామనే కోరిక పుడుతుంది. కాని నేడు మన నాట సమాధుల దగ్గర జరుగుతున్న దాని ఫలితం పూర్తిగా భిన్నంగా ఉంది. మీరే ఆలోచించండి! ఏ సమాధుల దగ్గరయితే ప్రేమ పురాణాలు, బహుదైవా రాధన విషయాలు నిండి ఉండే ఖవ్వాలీ గాన కచేరీలు జరుగుతాయో అక్కడ పరలోక జ్ఞాపకాలు ఎలా వస్తాయి? డోలు, ఢమరుకాల వాద్యం మత్తులో యువతీయువకులు ఊగిపోతూ ఉన్నచోట ముంకిర్ నకీర్ జ్ఞాపకం ఎలా వస్తారు?

2001 ఏప్రిల్ నెలలో జరిగిన సంఘటన గుర్తుచేసుకోండి!. పాక్‌పతన్ ప్రదేశంలోని బాబా ఫరీద్ దర్గా దగ్గర జాతర సందర్భంగా స్వర్గద్వారం (అనబడే ఒక ప్రత్యేకద్వారం) గుండా వెళ్ళాలని కోరుకున్న జనసందోహం మధ్య జరిగిన తొక్కిసలాటలో అరవైమంది మరణించారు. దానికి కారణం ఏమని తెలుపబడిందంటే, దర్గాపూజారి, దర్గాకు 'సేవ' చేస్తున్నందుకుగాను ప్రతి సంవత్సరం ప్రభుత్వం అతనికి ఒకటిన్నర లక్షలు గ్రాంటు ఇస్తుంది. ఆ పూజారి స్వర్గద్వారం తెరువకముందు తన గ్రాంటు ఒకటిన్నర నుంచి పదిహేను లక్షలకు పెంచమనీ, అప్పుడే ద్వారం తెరుస్తాననీ అక్కడి యాజమాన్యంతో గంటల తరబడి వాదులాడుతూ ఉన్నాడు. ద్వారం తెరువడంలో చాలా ఆలస్యమైంది. ద్వారం దగ్గర రద్దీ పెరిగింది. దాని మూలంగానే ఆ సంఘటన సంభవించింది.

సమాధి పూజ, బహుదైవారాధన పరలోకంలో ఎలాగూ మానవుల వినాశానికి, కారణమవుతుంది. దానితోపాటు ఈ ప్రపంచంలో కూడా దాని వల్ల జరిగే సామాజిక చెడులను, నైతికరాహిత్యాన్ని, ఇతర విషపూరిత ఫలితాలను ఈ క్రింద పేర్కొనబడిన వార్తాపత్రికల్లో వచ్చిన వార్తల ద్వారా అంచనా వేయవచ్చు.

1) బహావల్‌పూర్ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఆ జిల్లాలో ఖాజా మహ్కముద్దీన్ మీరాయి దర్గా దగ్గర ప్రతియేటా జరిగే జాతరకు వెళ్ళారు. ఆ దర్గాపూజారి కొడుకు వారిద్దరిని అపహరించాడు. నిందితుడి తండ్రి అయిన దర్గాపూజారి కూడా మాదక ద్రవ్యాలు అమ్ముతూ పట్టుబడినవాడే.[2]

1) వివరాలకు చూడండి దావత్ పత్రిక 1422 సఫర్ మాసం, మే, 2001 లాహోర్, పాకిస్తాన్
2) 'ఖబ్‌రే' దినపత్రిక, లాహోర్ 15 అక్టోబర్, 1992.

https://teluguislam.net



2) రాయ్‌వండ్ ప్రదేశంలో బాబారహ్మత్ షాహ్ దర్గా దగ్గర జరిగే జాతరలో వెరైటీ ప్రోగ్రామ్ పేరిట వేయబడిన ఏడు క్యాంపుల్లో నృత్యకచేరీలు సాగుతున్నాయి. డజనులమంది నవయువతులైన అమ్మాయిలు అశ్లీల నృత్యం చేసి చూపరుల నీరాజనాలు అందుకుంటున్నారు. చూపరులందరూ కొత్తకొత్త నోట్ల కట్టలతో ఇక్కడికి వస్తారు. రాత్రి రెండు గంటలవరకు మువ్వల సవ్వడి, తాగుబోతుల రొద వినిపిస్తూ ఉంటాయి. సైకిల్‌షో అనే కార్యక్రమంలో అబ్బాయిలు అమ్మాయిల వేషం వేసి డాన్స్ చేస్తూ స్వలింగ సంపర్కానికి కారణమవుతున్నారు. జాతరలో జూదం, మద్యపానం, ఆయుధ ప్రదర్శన సర్వసామాన్యం అయిపోయింది. పౌరులు నిరసనలు చేసినా ఎలాంటి చర్య తీసుకోబడలేదు.[1]

3) దాతా తిరునాళ్ళ ముసుగులో అశ్లీల పాటలతో ఉద్వేగభరితమైన డాన్సు, పోలీసుల, ఆలయ యజమానుల సహాయంతో డజన్లకొలది వేశ్యల రహస్యక్యాంపులు విపరీతంగా కొనసాగుతున్నాయి. అశ్లీల పాటలతో ఉద్విగ్నభరిత నత్యం చూడటానికి పదేళ్ల పిల్లల నుంచి డెబ్భైయేళ్ల కురువృద్ధులదాకా వందల సంఖ్యలో వస్తారు. గంజాయి పొగలు, అశ్లీల పదజాలంతో కూడిన ఆ పాటలు అసలే మత్తెక్కివున్న ఆ గానకచేరీలను మరింత వేడెక్కిస్తాయి. వందరూపాయల నోట్లు అర్పించబడతాయి. ఒకవేశ్య మరియు ఓ గ్లోకార్ పరస్పరం చాలా సేపటివరకు కౌగిలించుకొని అలాగే నించున్నారు. యువకులు వేశ్యల్ని పంచుకున్నారు. వారు పేరుపెట్టి పిలవగానే ఆ వేశ్యలు స్టేజీ మీదకు వచ్చి వారి మనసును రంజింపచేస్తారు. ఒక దశలో వేశ్యలు డాన్స్‌చేస్తూ నేలమీద వెల్లకిలా పడుకున్నారు. దాంతో ఆకతాయిలు లేచి నించున్నారు. అప్పుడు జరిగిన కోలాహలంలో వందలాది కుర్చీలు విరిగిపోయాయి.[2]

4) డబ్బా పీర్లు విదేశీ ఏజెంట్ల వ్యాపారం కూడా చేబుచ్చుకున్నారు. ప్రభుత్వంతో ప్రగాఢమైన సంబంధాలు కలిగి ఉన్నారు. వారి ఈ రాజకీయ ప్రభుత్వ అండదండల మూలంగా పోలీసులు నేరాలను వృత్తిగా చేసుకుంటున్న ఎంతోమందిని అరెస్టు చేయటానికి భయపడుతున్నారు. ఇండ్ల వెంట తిరిగే ఫకీర్లు రాజకీయ సభలు సమావేశాలకు తప్పకుండా హాజరవుతారు.[3]

5) స్త్రీల నగ్న శరీరాల మీద తావీజులు రాసే రాస్పొటెన్ పట్టుబడ్డాడు. అతణ్ణి వ్యభిచారం హత్య, దోపిడి, స్మగ్లింగ్ మొదలగు నేరాల క్రింద అనేక జిల్లాల పోలీసులు

---

1) నవాయె వఖ్త్ దినపత్రిక లాహోర్ 6 ఆగస్టు 2001.
2) ఖబ్రే రిపోర్ట్ షాహ్‌రాహ్‌బహాష్‌పర్ సౌజన్యంతో-అమీర్ హమ్‌జా 79వ పుట.
3) ఖబ్రే రిపోర్ట్, షాహ్‌రాహ్ బహాష్‌పర్ సౌజన్యంతో, అమీర్ హమ్‌జా-79వ పుట

https://teluguislam.net



వెతుకుతున్నారు. ముల్తాన్ తర్వాత షేఖూపూరా శివారుగ్రామాల్లో ఓ 'మఠం' స్థాపించి ఈ అవినీతి వ్యాపారం చేస్తుండేవాడు.[1]

పాఠక మహాశయులారా!

మన దర్గాల, మఠాల, ఆస్థాన లోకపు సంక్షిప్త సమాచారం ఇది. చూశారుగా! అవి మనం నివసిస్తున్న లోకం కన్నా ఎక్కువ రంగవైభవంగా, ఎక్కువ మనోహరంగా, ఎక్కువ ఆకర్షవంతంగా ఉంటాయి. ఇలాంటి సమాధులు, దర్గాల దగ్గరికివెళితే చావు ఎలా గుర్తుకొస్తుంది? పరలోకం జ్ఞాపకం ఎందుకు వస్తుంది? శిక్ష లేక బహుమానపు చింత ఎలా పుడుతుంది? దైవభీతి ఎవరి హృదయంలో పుడుతుంది? ఐహిక అనాసక్తత ఎలా జనిస్తుంది? అందుకే, ఈ కారణంగానే ఇస్లాం ధర్మంలో సమాధుల దగ్గర జాతరలు పెట్టడం, కచేరీలు చేయటం, క్యాంపులు నిర్వహించటం, గుంబదులు నిర్మించటం, తిరునాళ్లు చేయటం, దీపాలు పేర్చటం, పూలదుప్పట్లు పరవటం సమాధి లేక దానిమీద కట్టబడి ఉన్న కట్టడాన్ని చుంబించటం, దాని ముందు తలవంచటం, సజ్దా చేయటం సమాధి చుట్టూ ప్రదక్షిణలు చేయటం, సమాధి దగ్గర ఖుర్బానీ చేయటం, అన్నదానం చేయటం? సమాధిలో ఉన్నవారికి తమ బాధలు, అవసరాలు నివేదించుకోవటం మొదలగునవన్నీ నిషేధించబడ్డాయి. పెద్ద షిర్క్ అంత ఘోరపాపాలు ఇవి. పోతే ఏ పండితుల విధానంలోనయితే ఈ పనులన్నీ ధర్మసమ్మతంగా భావించబడ్డాయో వారిని మేము కడు బాధాతప్త హృదయంతో, చిత్తశుద్ధితో విన్నవించుకునేదేమిటంటే "ఏమండీ! మీరే ఆలోచించండి. బలులు ఇవ్వటానికని, జాతరలు చేయటానికని, మొక్కుబడులు చెల్లించుకోవటానికని విన్నపాలు చేసుకోవటానికని, దానధర్మాలు చేయటానికని, అవసరాలు తీర్చమని కోరటానికని ఏదో వంకతో సమాధుల దగ్గరికి, మఠాల దగ్గరికి, ఆస్థానాల దగ్గరికి వచ్చే స్త్రీ పురుషుల మూలంగా సమాజంలో జనిస్తున్న నైతికరాహిత్యం, అశ్లీల వాతావరణం, వ్యభిచారం, ఇతర చెడుల నిర్లజ్జాకరమైన సంస్కృతికి బాధ్యులు ఎవరు? ప్రళయదినాన దీనికి జవాబుదారీ వహించే బాధ్యత ఎవరిది?

రెండు: ఆ పండితుల దృష్టిని కాస్త ఈ మాటవైపు కూడా సారించదలిచాం. అదేమిటంటే మంచి నుంచి మంచే పుడుతుంది. మేలు నుంచి మేలే పుడుతుంది. అలాగే చెడు, పాపాల నుంచి చెడు, పాపాలే పుడతాయి. ఇది సర్వజనామోద సత్యం. మామిడిచెట్టు నాటితే కందిపప్పు రాదు. కందిపప్పు నాటితే మామిడిపండ్లు కాయవు-ఇలా ఎప్పుడూ జరగలేదు. సమాధుల దగ్గర, మఠాల్లో మొక్కుబడులు చెల్లించుకోవటం, బలులు ఇవ్వటం కోరికలు తీర్చమని వేడుకోవటం, జాతరలు, తిరునాళ్లు చేయటం గనక నిజంగా ఇస్లామీయ షరీఅత్‌లో సమ్మతమైనవి, పుణ్యప్రదమైనవి అయితే ఆ

---

1) ఖబ్రే రిపోర్ట్ షాహ్‌రాహ్ బహస్తపర్ సౌజన్యంతో, అమర్ హమ్‌జా-67వ పుట.

https://teluguislam.net



మంచిపనుల నుంచి, ఆ పుణ్యకార్యాల నుంచి అశ్లీల, నిర్లజ్జాకరమైన, వ్యభిచార, నేరవృత్తితో కూడిన సంస్కృతి ఎందుకు జన్మిస్తోంది? సమాజాన్ని జూదం, వ్యభిచారం, మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం, ఇతర నేరాల నుంచి ప్రక్షాళనం చేయాలని కోరుకునే పండితులు మా ప్రశ్న గురించి చిత్తశుద్ధితో ఆలోచిస్తారా?

## చావు ఇచ్చే సందేశం!

నిస్సందేహంగా చావు ఓ ఘోరప్రమాదం. కొన్ని సందర్భాల్లో ఇంట్లో ఒక మనిషి చనిపోవటం మూలంగా ఎన్నో జీవితవ్యవహారాలు చిందర వొందర అయిపోతాయి. ఎన్నో ప్రణాళికలు అసంపూర్ణంగా మిగిలిపోతాయి. ఎన్నో అందమైన కలలు కల్లలై పోతాయి. ఒకచోట చిన్న చిన్న పిల్లలు అనాథలైపోతే మరోచోట ముసలి తల్లిదండ్రులు నిరాధారులైపోతారు. కొన్నిచోట్ల కొందరి వైవాహిక జీవితాలు నాశనమయితే మరికొన్ని చోట్ల అన్నాచెల్లెళ్ల ఆధారాలు తొలగిపోతాయి. తీవ్ర దుఃఖవిచారకరమైన ఈ పరిస్థితిలో మృతుని ఆత్మీయుల నుంచి సాధారణంగా రెండు రకాల స్పందనలు వ్యక్తం అవుతాయి.

1) చనిపోయిన యెడబాటు దుఃఖం. ఇది పూర్తిగా ఓ సహజ విషయం. షరీఅత్ పరిధుల్లో ఉంటూ దుఃఖాన్ని, బాధను వ్యక్తం చేయటం తప్పూకాదు, నిషేధమూ కాదు.

2) మృతుని ప్రాపంచికపు పనుల చింత: ఇంట్లో ఓ ముఖ్యవ్యక్తి చనిపోవటం మూలంగా జీవన వనరులు స్తంభించిపోవటం, దాని ప్రత్యామ్నాయ వనరులను గురించి ఆలోచించటం. అతను వదలివెళ్లిన ఆస్తిని పంచటం. ఈ పనులు చేయటం మనిషికి ఎలాగూ తప్పదు. షరీఅత్ నియమించిన హద్దులు పాటిస్తూ ప్రాపంచిక వ్యవహారాల గురించి ఆలోచించటం తప్పు కాదు. పైగా అది అవసరం కూడా.

అయితే శోచనీయమైన విషయం ఏమిటంటే ఆత్మీయుల మరణం వల్ల వ్యక్తమయ్యే ఈ స్పందన షరీఅతు హద్దుల్ని దాటి వారి మనుషుల మనోమస్తిష్కాలను మరో విధంగా ఆవహిస్తుంది. దానిమూలంగా చావు ఇచ్చే అసలు సందేశం ఎవరి బుర్రలకూ తట్టదు. జీవన్మరణాల ఈ కోలాహలంలో ఎవరికీ ఈ రెండు విషయాలు తప్ప ఆలోచించదగిన విషయం మరొకటి ఆత్మీయులకు చావుఇచ్చే అసలు సందేశం ఇదిః

'ఈ రోజు ఇతని వంతైతే ..................................రేపు మీ వంతు'.

మృత్యుదూత ప్రతి మనిషి కోసం మాటువేసి ఉన్నాడు. మన చుట్టుప్రక్కల ఎన్నో ఉదాహరణలు గడుస్తుంటాయి. బాగా ఆరోగ్యంగా ఉన్న మనుషులు రాత్రిపూట రోజులాగే తమ పడకలమీద నిద్రపోతారు. కాని వారికి ఉదయం నిద్రమేల్కొనే వ్యవధి కూడా ఉండదు. ఎంతోమంది తమ ఇండ్లనుంచి ఉమ్రా లేక హజ్ చేయాలనే ఉద్దేశ్యంతో

https://teluguislam.net


బయలుదేరుతారు కాని వారికి తిరిగి ఇంటికి చేరుకునే అదృష్టం ఉండదు. ఎన్నో వివాహబృందాలు బాజాభజంత్రీలతో, సన్నాయి మోతలతో బయలుదేరుతాయి కాని విధివక్రించినవేళ దుఃఖవిచారాలతో గుండెలు బాదుకుంటూ తిరిగిరావలసి వస్తుంది. ఎంతోమంది తమ దైనందిన పనుల్లో నిమగ్నులై ఉంటారు. హఠాత్తుగా వారికి గుండెపోటు వస్తుంది. దాంతో ఆ పనులన్నీ ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఉండిపోతాయి. నేటికి రేపటికి భేదమెంతో జీవన్మరణాలమధ్య భేదం కూడా అంతే. ఈ వాస్తవాన్నే దైవప్రవక్త (సల్లం) ఎంతో అందమైన రీతిలో వివరించారు.

اَلْيَوْمَ عَمَلٌ وَلَا حِسَابٌ وَغَدًا حِسَابٌ وَلَا عَمَلٌ

ఈ రోజు కర్మలు, విచారణ కాదు. రేపు విచారణ, కర్మలు కాదు (బుఖారీ)

దైవప్రవక్త (సల్లం) అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) కు "అబ్దుల్లాహ్! ప్రపంచంలో ఒక బాటసారిలాగా జీవితం గడుపు" అని ఉపదేశించారు. అందుకే అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇలా అంటుండేవారు: ప్రజలారా! సాయంత్రమయితే ఉదయం కోసం ఎదురుచూడకండి. ఉదయమైతే సాయంత్రం కోసం ఎదురుచూడకండి. అనారోగ్యానికి ముందు ఆరోగ్యాన్ని, చావుకు ముందు జీవితాన్ని విలువైనవిగా భావించండి.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజి) ఇలా తెలియజేస్తున్నారు: ఒకరోజు దైవప్రవక్త (సల్లం) చాపమీద ఒంటికి చొక్కా లేకుండా పడుకొని ఉన్నారు. ఆయన శరీరం మీద చాపతాలూకు చారలు కూడా ఏర్పడ్డాయి. అది చూసి నేను "దైవప్రవక్తా! మీరు అనుమతిస్తే మేము మీ కోసం ఓ మంచి పడక తయారు చేసి ఇస్తాం" అని అడిగారు. అందుకాయన "నాకు ఈ ప్రపంచంతో పనేంటి? బాటసారి ఓ చెట్టుకింద కాసేపు విశ్రాంతి తీసుకుంటాడు. ఆ తర్వాత చెట్టువదలి బయలుదేరి వెళ్ళిపోతాడు. నాకు ఈ ప్రపంచంతో ఉన్న సంబంధం అంతే!" అని అన్నారు. (అహ్మద్, తిర్మిజీ, ఇబ్నెమాజా)

ప్రపంచంలో మనిషి తాత్కాలిక నివాసాన్ని ఈ ఉదాహరణ ద్వారా కాకుండా మరో ఉదాహరణ ద్వారా అర్థం చేసుకోవటం అసాధ్యం. ఈ ప్రపంచం కేవలం ఓ సత్రం లాంటిది. ప్రతి బాటసారి అందులో కాసేపు లేక ఎక్కువసేపు ఆగి తర్వాత మళ్లీ గమ్యానికి బయలుదేరుతాడు. సత్రంలో కొన్ని గంటలు విశ్రాంతి తీసుకునే బాటసారి అక్కడ స్థలం కొనాలని, ఇల్లు కట్టాలని, వ్యాపారం నడపాలని ఎన్నడూ అనుకోడు. పైగా అక్కడి పరిసరాల పట్ల నిరపేక్షాభావం వ్యక్తం చేస్తూ కొన్ని గడియల తర్వాత తన దారిన తను వెళ్ళిపోతాడు. ఆ కొన్ని గడియల జీవితం కూడా మనిషిపాలిట ఎంత మోసకరమో! ఎందుకంటే నెలలు సంవత్సరాలు గడుస్తుంటే మనిషి తను యువకుణ్ణవుతున్నానని సంతోషిస్తాడు. నిజానికి గడిచే ప్రతిక్షణం అతన్ని అతని గమ్యానికి, మృత్యు కుహరానికి... చేరుస్తూ ఉంటుంది.

https://teluguislam.net


జీవితం గడిచిపోతున్న కొద్దీ ఆశలు యవ్వనానికి చేరుకుంటూ ఉంటాయి. మనిషి తన మనోవాంఛల పరిపూర్తి కోసం రేయింబవళ్ళు కష్టపడతాడు. జీవితం ఎంతో అందంగా రమణీయంగా కనిపిస్తుంది. మనిషి అవిరామంగా పద్దెనిమిది ఇరవై గంటలు పనిలోనే గడుపుతాడు. రేయింబవళ్లు పని చేసి చేసి వెంట్రుకలు నెరవటం మొదలవుతుంది అప్పుడు కూడా మనిషి, నేను ఇంకా యువకుణ్ణే అని అనుకుంటాడు.

కాల ప్రవాహం జయాపజయాల, సుఖదుఃఖాల తరంగాలతో నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. పోను పోను మనిషి మెల్లగా తన జవసత్వాలుడిగిపోతున్నట్లు గ్రహిస్తాడు. వృద్ధాప్యం మరణ ఘంటికలు మోగిస్తూ ఉంటుంది. కాని చావు విషయంలో ఏమరుపాటు వహించే మనిషి జీవిత రహదారిపై అలాగే ముందుకు నడుస్తూ ఉంటాడు. ఇంకా చాలా సమయం ఉంది అనే అనుకుంటూ ఉంటాడు. పెద్ద పెద్ద కోరికలు, తోకలేని ఆశలు, సుదీర్ఘ ప్రణాళికలు. వీటిని సాకారం చేసుకోవటం కోసం కృషి కొనసాగుతూ ఉంటుంది. డాలర్, రియాల్, దీనార్, రూపాయలు,ప్లాటు,ఫ్లాట్లు, ఫ్యాక్టరీలు ఇల్లు, కారు వీటి చింతలోనే జీవితం గడుస్తూ ఉంటుంది. అత్యున్నత ప్రమాణజీవితాన్ని అనుభవించటం కోసం ప్రయత్నించటంలోనే రేయింబవళ్లు గడిచిపోతుంటాయి. ముందువెనుక, అటు ఇటు ఆత్మీయుల బంధుమిత్రుల మరణ సంఘటనలు సంభవిస్తూ ఉంటాయి. అప్పుడు ఏదో మొక్కుబడికి సంతాపం ప్రకటించి తర్వాత మళ్లీ జీవిత పోరాటంలో నిమగ్నుడైపోతాడు. మృత్యుదూత తన కోసం ఏం సందేశం వదిలివెళ్ళాడో ఆలోచించటానికి కూడా అతనికి తీరిక ఉండదు. కుడ్య పత్రం కళ్లముందు కనిపిస్తూ ఉన్నా జీవితపు మనోహర దృశ్యాలు దానిని చదువనిస్తే కదా!

జనం చెప్పుకుంటారు. ఒకతనికి ఇజ్రాయీల్ దూతతో స్నేహం కుదిరిందట. అతను ఇజ్రాయీల్ దూతను "మీరు నా దగ్గరికి ( నా ప్రాణం తీయటానికి) రావలసివస్తే ఒక సంవత్సరం ముందే చెప్పండి. చావు కోసం నేను తగిన సన్నాహాలు చేసుకుంటాను" అని అడిగాడట. ఇజ్రాయీల్ దూత అలాగే వాగ్దానం చేశాడు. ఒకరోజు ఆయన హఠాత్తుగా దైవాజ్ఞ తీసుకొని వచ్చారు. మృత్యుదూత హఠాత్తుగా ప్రత్యక్షం కావటం చూసి అతను కంగారుపడ్డాడు. 'అయ్యా! మీరు నాకు ఒక సంవత్సరం ముందే తెలియజేస్తానని వాగ్దానం చేసి ఇప్పుడు హఠాత్తుగా వచ్చేశారేమిటి?" అని అడిగాడు. దానికి ఇజ్రాయిల్ "ఈ యేడు నేను ఫలానా నీ బంధువు దగ్గరికి వచ్చాను. ఫలానా నీ మిత్రుడి దగ్గరికి వచ్చాను. ఫలానా నీ ఆత్మీయుడి దగ్గరికి వచ్చాను. నువ్వు కూడా సిద్ధంగా ఉండు, నీ దగ్గరికి కూడా రాబోతున్నాను అని తెలియజెప్పటానికే నేను నీవాళ్ల దగ్గరికి వస్తూఉన్నాను. నువ్వు తెలివి గలవాడివేమో, అర్థం చేసుకుంటావేమో అనుకున్నాను. నువ్వు ఇంత మూర్ఖుడివై ఉండి అర్థం చేసుకోలేకపోతే అందులో నా తప్పేముంది?" అని అన్నాడట.

మృత్యుదూత ప్రాణం మీదికి వచ్చి నించున్నప్పుడు జీవితపు ఆఖరి క్షణంలో మనిషి ఆలోచిస్తూ ఉంటాడు. "అరవై డెబ్భై యేళ్ల జీవితం రెప్పపాటులో గడిచిపోయింది.

https://teluguislam.net



బాల్యం నిన్నటిమాట. యవ్వనం ఓ అందమైన కలకంటే ఎక్కువేం కాదు. సంపాదనా వ్యయాల పోరులో మంచి పనులకు తీరికే దొరకలేదు...... ఇంత సుదీర్ఘమైన ఇంత సంక్లిష్టమైన జీవితమా!''.... అప్పుడు మనిషి దుఃఖవిచారాల, నిరాశానిస్పృహల విగ్రహమై అశ్రవణ స్వరంతో 'నాలుగు రోజుల జీవితం అరువు తెచ్చుకుంటిని. అందులోరెండు రోజులు ఆశలో గడిచిపోగా, రెండు రోజులు నిరీక్షణలో గడిచిపోయాయి'' అని అనుకుంటూ ఇహలోకం నుంచి వెళ్ళిపోతాడు.

మనక్కూడా మన ముందు వెనక కుడి ఎడమల్లో జరుగుతున్న మరణాలప్పుడు మృత్యుదూత సందేశం వినే తీరిక లభిస్తే బాగుండు!

పాఠక మహాశయులారా!

పవిత్రుడైన అల్లాహ్ నా మీద అనంత కరుణానుగ్రహాలు కురిపించాడు. నాలాంటి ఓ అయోగ్యుడికి, పాపాత్ముడికి, విద్యలేనివాడికి, అనాచారికి 'తఫ్హీముస్సున్నహ్ పరంపరలోని పదిహేను భాగాలు పూర్తిచేసే సౌభ్యాగాన్ని ప్రసాదించి నాకు లెక్కలేనన్ని ఉపకారాలు చేశాడు. అందుకుగాను నేను ఆయనకు ఎంత కృతజ్ఞత తెలుపుకున్నా తక్కువే. ఈ సత్కార్యంలో నాకు సహకరించిన చిత్తశుద్ధులు-మిత్రులు, స్నేహితులందరికి కూడా నేను కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. వారు ఏ సందర్భంలోనూ నాకు సహాయం చేయటానికి వెనుకాడలేదు. ఈ సత్కార్యంలో పాలుపంచుకున్న మిత్రులందరికి ఇహపరాల్లోనూ గౌరవోన్నతుల్ని ప్రసాదించమని అల్లాహ్ను ప్రార్థిస్తున్నాను.

హదీసుల ప్రామాణికత విషయంలో ఇంతకుముందులాగే పూర్తి జాగ్రత్తలు తీసుకోవటం జరిగింది. అయినాగాని ఒకవేళ ఎక్కడైనా తప్పులుదొర్లి ఉంటే దయచేసి మాకు తెలియజేయమని, మేము వారికి రుణపడి ఉంటామని పండితులకు విన్నవించుకుంటున్నాం.

తఫ్హీముస్సున్నహ్ పనిలో దాదాపు సగం పని ఇంకా మిగిలి ఉంది. ఎంత పని పూర్తవుతుందో ఎంతకాదో అల్లాహ్కు మాత్రమే తెలుసు. అల్లాహ్ గనక తన కరుణాకటాక్షాలతో మిగతా పనిని పూర్తిచేసే భాగ్యం కూడా ఈ పాపాత్ముడైన దాసునికే ప్రసాదిస్తే అది ఆయన నిరపేక్షత, దయానుగ్రహం. వమా జాలిక అలల్లాహి బిఅజీజ్. మా కోసం దుఆ చేయమని పాఠకులకు మనవి.

اَلْحَمْدُلِلّٰهِ الَّذِیْ بِنِعْمَتِهٖ تَتِمُّ الصَّالِحَاتُ وَ اَلْفُ اَلْفِ صَلَاةٍ وَ سَلَامٍ عَلٰی اَفْضَلِ الْبَرِیَّاتِ

وَ عَلٰی آلِهٖ وَ اَصْحَابِهٖ اَجْمَعِیْنَ بِرَحْمَتِکَ یَا اَرْحَمَ الرَّاحِمِیْنَ!

అల్హమ్దు లిల్లాహిల్లజీ బినీమతిహీ తతిమ్ముస్సాలిహాతు వఅల్ఫు అల్ఫి సలాతిన్ వ సలామిన్ అలా అఫ్జలిల్ బరియ్యతి వ అలా ఆలిహీ వ అస్హాబిహీ అజ్మయీన్ బిరహ్మతిక యా అర్హమర్రాహిమీన్!

ముహమ్మద్ ఇక్బాల్ కైలానీ, రియాద్, సౌదీ అరేబియా, 12 రబీవుల్ అవ్వల్, 1426 హి.శ, 22 ఏప్రిల్ 2001.